సర్వాధికారి, సర్వోత్తముడూ అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం.

# దేవుని పాత్ర

## అపార్ధానికి గురైన దేవుని ప్రతిచర్యా విధానం




రచయిత :Dr.షఃజాద్ సలీం    అనువాదకుడు:Md.అఖిల్ అలి

**Writer: Dr.Shehzad Saleem**    **Translator: Md.Akhil Ali**

# దేవుని పాత్ర

## అపార్థానికి గురైన దేవుని ప్రతిచర్యా విధానం

### 01. పరిచయం:

ఆధ్యాత్మిక మతాలను అర్థం చేసుకోవటానికి మార్చసఖ్యం కాని దేవుని ప్రతిచర్యా విధానాన్ని తెలుసుకోవటం చాలా అవసరం. ఈ విధానం స్వయంగా ఆయనే రూపొందించాడు మరియు దానిని అమలుపరిచేవాడు కూడా ఆయనే. ఈ అమలు పరిచే విధానం రెండు రకాలుగా ఉంటుంది. 1.ప్రకృతి వైపరిత్యాల రూపంలోనూ 2.ఆనాటి తన సందేసహరుని ద్వారా గాని, లేక ఆ సందేసహరుని ప్రత్యక్ష అనుచరుల ద్వారా గాని, లేక షరియత్ కు ఏ మాత్రం సంబంధం లేని మరో రూపంలో గాని ఉంటుంది. ఆయా

సమూహాల ప్రజలను ఉద్దేశించి ఆయా జాతుల ప్రవక్తలు వారికి ప్రత్యక్షంగా దైవ సందేశాన్ని సంపూర్ణంగా అందించడం, ఆ సందేశం చాలా సత్యమని ఆయా జాతుల ప్రజలకు సంపూర్ణంగా అర్థమైపోయిన తరువాత కూడా వారు కేవలం కావాలనే మంకుపట్టుతో ఆ సందేశాన్ని తిరస్కరించినప్పుడు దేవుడు ఆయా జాతుల ప్రజలను ప్రకృతి వైపరిత్యాల రూపంలోనో, లేక తన ప్రవక్తల లేక ప్రవక్తల ప్రత్యక్ష అనుచరుల ద్వారనో ఈ ప్రాపంచిక జీవితంలోనే శిక్షకు గురిచేసేస్తాడు. అలాగే ఎవరైతే ఆయా ప్రవక్తల సందేశాన్ని స్వీకరించి మంచి పనులు చేస్తారో, వారికి ఈ లోకం నుండే అనుగ్రహాలను కురిపించడం ప్రారంభిస్తాడు. దేవుడు తన ప్రవక్తలను తిరస్కరించిన వారిని శిక్షించటానికి స్వయంగా ఆయా ప్రవక్తలను మరియు అతని ప్రత్యక్ష అనుచరులను తన ఆయుధాలుగా మలచి శిక్షకు గురిచేసేస్తాడు.

ఇటువంటి శిక్షలను అమలుపరచడం మానవ మాత్రులు స్వతహాగా తమ చేతులలో తీసుకొని అమలు చేయవలసిన పనికాదు. ఇది కేవలం దేవుడే నిర్వర్తించవలసిన కార్యం. ఈ విధంగా తిరస్కారులను ఈ ప్రపంచంలోనే శిక్షించటానికి కారణం ఏమిటంటే, వారు మరచిపోయిన ఒక గొప్ప సత్యాన్ని తెలియ పరచటానికి. అదేమిటంటే, ఒకవ్యక్తి యొక్క ఆచరణను బట్టి పరలోకంలో శిక్షా-బహుమానాలు కలవని తెలియజేయటమే. పరలోకపు ఈ శిక్షా-బహుమానాలు అత్యంత వాస్తవమని తెలియజేయటానికే దేవుడు ఈ లోకంలో తన ప్రవక్తలను పంపాడు. ఈ ప్రపంచంలో ప్రవక్తలు సందేశం ఇవ్వగా తిరస్కరించిన జాతులను సర్వనాసనం చేయడం దేనికి నిదర్శనమంటే, ప్రతీ వ్యక్తీ తాను ఈ లోకంలో చేసిన ప్రతీ మంచి-చెడు పనులకుగాను ఆ రాబోయే పరలోక జీవితంలో ప్రతిఫలాన్ని పొందనున్నాడు అనేదానికి నిదర్శనం. అలాగే ఆ రాబోయే

పరలోకంలో శిక్షా-బహుమానాలు ఉన్నాయనటానికి ఈ ప్రపంచంలోనే మంచి వారికి మంచి ప్రతిఫలం, చెడ్డవారికి చెడు ప్రతిఫలం దేవుడు తన ప్రవక్తల సమాజాలకు గతంలో ఇచ్చిఉన్నాడు. అందుకే 4:165లో "అల్లాహ్ కు వ్యతిరేకంగా వాదించటానికి ప్రజలకు ఏ మాత్రం సాకులు లేకుండా ఉండటానికి ఆయన తన ప్రవక్తల ద్వారా హెచ్చరించి ఉన్నాడు" అని చెప్పడం జరిగింది.

దేవుని ఈ ప్రతిచర్యా విధానానికి సంబంధించి ఖురాన్ గ్రంధంలో చాలా వివరాలు ఉన్నప్పటికీ, హమీదుద్దీన్ ఫరాహీ (1863-1930) గారు తన రచనల్లో ఈ దైవ ప్రతిచర్యా విధానాన్ని ఎంతో బలంగా నిరూపించారు. దాని తరువాత అతని శిష్యుడు అమీన్ అహ్సాన్ ఇస్లాహి (1904-1997) తన గురువు గారి ఆలోచనలకు మరిన్ని ఖురాన్ వాక్యాలను జోడించి తాను రచించిన తఫ్సీర్

తదబ్బురే ఖురాన్ అనే పుస్తకంలో మరింతగా వివరించారు. అలాగే ఈ ఇద్దరి వారసుడు అయిన జావేద్ అహ్మద్ గామది గారు (జ:1951) మరింత ఖచ్చితంగా ఈ దైవ ప్రతిచర్యా విధానాన్ని తాను రచించిన పుస్తకాలలో తెలియజేశారు.

అయితే చాలామంది ఇస్లాం పండితులు ఈ దైవ ప్రతిచర్యా విధానాన్ని తప్పుగా అర్థం చేసుకొని, ప్రవక్త ముహమ్మద్ ఈ లోకం నుండి నిష్క్రమించిన తరువాత కూడా సత్య ధర్మాన్ని స్వీకరించని వారిని శిక్షించటానికి మరియు వారిని తమ ఆధీనంలో ఉంచుకోవటానికి ముస్లింలకు షరియత్ అప్పగించిన బాధ్యతగా భావిస్తున్నారు. ఈ విధమైన భావనల కారణంగా మరిన్ని తప్పుడు అభిప్రాయాలు ఏర్పడ్డాయి. తద్వారా దేవుడు చేయవలసిన పనులు మానవులు తమ నెత్తిన వేసుకోవలసిన

దుస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా వీరు అపర దైవల్తై నేరస్తులయ్యారు.

ఈ సందర్భంగా పై ఉదహరించిన ఆ ముగ్గురు పండితుల పరిశీలనాత్మక విషయాలను దృష్టిలో ఉంచుకొని ఈ దైవ ప్రతిచర్యా విధానానికి సంబంధించిన మరింత సమాచారాన్ని ఈ చిరు పుస్తకంలో చర్చించడం జరుగుతుంది.

ముందుగా: దైవ సందేశహరుల ప్రచార పరిశ్రమపై దైవ ప్రతిచర్యా విధానం ఏవిధంగా ఆవరించి ఉంది అనే విషయాల వివరణ.

రెండవది: ప్రవక్త ముహమ్మద్ కాలంలో చివరిసారిగా సంభవించిన దేవుని ప్రతిచర్యా విధానం యొక్క వివరణాత్మక విశ్లేషణ.

మూడవది: ఏవిధంగా కొందరు పండితులు తప్పుడు ధృక్పథం కలిగి ఈ దేవుని ప్రతిచర్యా విధానాన్ని షరియత్ లో భాగంగా చేసేశారో కూడా చూపించడం జరుగుతుంది.

నాల్గవది: ముస్లిమేతరులతో సంబంధాలు అనే విషయం కూడా రాబోయే విచారణలో చూపడం జరుగుతుంది.

దేవుని ఈ ప్రతిచర్యా విధానానికి సంబంధించిన ఖచ్చితమైన ఖురాన్ వాక్యాలను మనం ఇప్పుడు గమనిద్దాం!

## 02.దైవ ప్రతిచర్య విధానం యొక్క ప్రకటన:

ఖురాన్ గ్రంథం ప్రకారం దేవుడు తన సందేశహరుల యొక్క జాతీయుల జాతకాన్ని స్వయంగా ఆయనే ఈ ప్రాపంచిక జీవితంలోనే నిర్ణయించేస్తాడు.

“ప్రతి సంఘానికి ఒక ప్రవక్త ఉంటాడు. కనుక ఒక సంఘం వద్దకు దాని ప్రవక్త వచ్చినప్పుడు ఆ సంఘం విషయంలో పూర్తి న్యాయంతో కూడుకున్న తీర్పు చెయ్యబడుతుంది. దానికి రవ్వంత అన్యాయం కూడా జరగదు”. -10:47

ఈ జాతకం ఎలా నిర్ణయించబడుతోందో ఈ క్రింది ఖురాన్ వాక్యాల ద్వారా వివరించడం జరిగింది.

“మీకు పూర్వం గతించిన జాతుల గాధలు మీదాకా చేరలేదా? నూహ్ జాతి, ఆద్‌జాతి, సమూద్ జాతి, ఇంకా వాటి తరువాత వచ్చిన అనేక జాతులు. వాటి సంఖ్య అల్లాహ్ కు మాత్రమే

తెలుసు. వారి ప్రవక్తలు వారి వద్దకు స్పష్టమైన మాటలను, ప్రస్ఫుటమైన నిదర్శనాలనూ తీసుకుని వచ్చినప్పుడు వారు తమ నోళ్ళల్లో చేతులు బిగబట్టి ఇలా అన్నారు: “ఏ సందేశంతో నీవు పంపబడ్డావో ఆ సందేశాన్ని మేము విశ్వసించము. ఏ విషయం వైపునకు నీవు మమ్మల్ని ఆహ్వానిస్తున్నావో మేము ఆ విషయాన్ని గురించి కలతలో, సందేహంలో పడ్డాము”. వారి ప్రవక్తలు వారితో ఇలా అన్నారు: “ఆకాశాలకూ భూమికీ సృష్టికర్త అయిన అల్లాహ్ పట్ల సందేహమా? ఆయన మిమ్మల్ని పిలుస్తున్నాడు, మీ తప్పులను మన్నించటానికి, మీకు ఒక నిర్ణీతకాలం వరకు వ్యవధినివ్వటానికి.” వారు ఇలా జవాబు పలికారు: "నీవు మావంటి ఒక మానవుడవు తప్ప మరేమీ కావు. మా తాత ముత్తాతల కాలం నుండి ఆరాధించబడుతూ వచ్చిన శక్తుల ఆరాధన నుండి నీవు మమ్మల్ని ఆపాలని అనుకుంటున్నావు. సరే, స్పష్టమైన ప్రమాణాన్ని దేనినైనా తీసుకునిరా”. వారి ప్రవక్తలు వారితో ఇలా అన్నారు: “నిజంగానే, మేము మీవంటి మానవులం తప్ప మరేమీ కాము. కానీ అల్లాహ్ తన దాసులలో తాను అనుగ్రహించదలచిన వారిని అనుగ్రహిస్తాడు. ఏదైనా ప్రమాణాన్ని తెచ్చి మీకు ఇవ్వటం అనేది మా

అధికారంలో లేదు. ప్రమాణం అనేది అల్లాహ్ అనుమతితో మాత్రమే రాగలుగుతుంది. విశ్వాసులు అల్లాహ్ని నమ్ముకోవాలి. మన జీవన మార్గాలలో అల్లాహ్ మనకు మార్గదర్శకత్వం వహించినప్పుడు మనం అల్లాహ్ను ఎందుకు నమ్ముకోకూడదు? మీరు మాకు పెడుతున్న బాధలను ఓర్పుతో సహిస్తాము. నమ్ముకునేవారు అల్లాహ్ను మాత్రమే నమ్ముకోవాలి". చివరకు తిరస్కారులు తమ ప్రవక్తలతో ఇలా అన్నారు: "మీరు మా మతంలోనికి తిరిగి రావాలి. లేకపోతే మేము మిమ్మల్ని మా దేశం నుండి బహిష్కరిస్తాము" అప్పుడు వారి ప్రభువు వారికి ఇలా వహీని పంపాడు. "మేము ఈ దుర్మార్గులను నాశనం చేస్తాము. వారి తరువాత మిమ్మల్ని భూమిపై వశింపచేస్తాము. నా సాన్నిధ్యంలో సమాధానం చెప్పుకోవలసి ఉంది అని భయపడుతూ నా శిక్షకు భయపడే వ్యక్తికే ఈ బహుమానం". వారు తీర్పును కోరారు. (అప్పుడు వారికి తీర్పు ఇవ్వబడింది). బలమదాంధుడు అయిన ప్రతీ సత్యవిరోధి అవమానం పాలయ్యాడు". -14:9-14

దేవుడు మరియు ఆయన ప్రవక్త ఎల్లప్పుడూ ఆధిక్యతను కలిగి ఉంటారు అనే విషయం ఈ క్రింది వాక్యంలో చెప్ప బడింది.

“నిశ్చయంగా అల్లాహ్నూ, ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించేవారు నీచాతి నీచమైన సృష్టికి చెందినవారు. నేను, నా ప్రవక్త మాత్రమే ఆధిక్యం వహించి తీరుతాము అని అల్లాహ్ వ్రాసిపెట్టాడు. నిజానికి అల్లాహ్ సర్వశక్తిమంతుడు, సర్వాధికుడును” -58:20-21

ఈ సందర్భంగా మరొక వాక్యంలో సర్వసృష్టికర్త అయిన దైవం తన ప్రవక్తకూ మరియు ప్రవక్త యొక్క అనుయా యులకూ విజయాన్ని ప్రసాదిస్తాడు మరియు ఇహపరాల సఫల్యాన్ని కూడా అనుగ్రహిస్తాడు.

“నిశ్చయంగా మేము మా ప్రవక్తలకూ, విశ్వాసులకూ ఇహలోక జీవితంలో కూడా తప్పకుండా సహాయం చేస్తాము. సాక్షులు నిలబడే రోజున కూడా సహాయం చేస్తాము”. -40:51

## 3. ప్రవక్తల సందేశంలో దేవుని ప్రతిచర్యా విధానం యొక్క వాస్తవికత:

ఈ దైవ ప్రతిచర్యా విధానాన్ని అమలు పరిచే పద్ధతిని వివరిస్తూ గామది గారు ఏమని రాస్తున్నారంటే...

దేవుడు, ఆ రాబోయే నిజమైన తీర్పు దినానికి ముందుగానే ఈ లోకంలో తన ప్రవక్తల ద్వారా ఈ శిక్షా-బహుమానాల వాస్తవికతను ప్రజలకు చూపిస్తూ ఉంటాడు. ఈ ప్రపంచంలో జరిగే ఈ చిన్నపాటి శిక్ష-బహుమానాల వ్యవస్థ, రాబోయే ఆ మహా

దినానికి ఒక చిన్న సూచన మాత్రమే. ఒకవేళ ప్రజలు దేవునితో చేసుకున్న ఒప్పందాన్ని గనుక నెరవేర్చినట్లైతే, అప్పుడు వారు ఈ లోకం నుండే దేవుని అనుగ్రహాలను పొందటం ప్రారంభిస్తారు. ఒకవేళ అలా కాకపోతే, ఈ లోకం నుండే వారికి శిక్షలు ప్రారంభమైపోతాయి. అది ఎలా ఉంటుందంటే, స్వయంగా ఈ ప్రవక్తలే దేవుని యొక్క నిదర్శనాలుగా మారి, దేవుడు ఈ ప్రవక్తలతో ఉంటూ ఈ శిక్షా-బహుమానాల తీర్పు చేసుకుంటూ వెళ్ళిపోతున్నాడు అని ప్రజలు గ్రహిస్తారు. ప్రవక్తలు ఏదైతే వారు స్వతహాగా దేవుని తరుపునుండి సత్యాన్ని అందుకున్నారో, ఆ సత్యాన్ని వారు ప్రజలకు బోధించాలి. ఖురాన్ పరిభాషలో దానిని "సత్య సాక్ష్యం" అని అంటారు. ఎప్పుడైతే ఈ సత్యసాక్ష్యం పూర్తయిందో, అప్పుడు మానవుల విషయంలో ఇహ-పరాల తీర్పుకు మార్గం సుగుమం అయినట్లే. దాని పర్యవసానంగా దేవుడు ఈ ప్రవక్తలకు ఆధిక్యతను ప్రసాదించి, ఈ సందేశాన్ని

తిరస్కరించిన వారికి దైవ శిక్షకు బలి చేసేస్తాడు. దైవ సందేశాన్ని ప్రజలు తిరస్కరించటానికి వీలులేని ఆధారాలతో సహా ప్రవక్తల ద్వారా దేవుడు నిరూపించాడు. ఈ సందర్భంలో ప్రాధమికంగా అవలంభించిన పద్ధతి  ఏమిటంటే, స్వయంగా దేవుని ప్రవక్తే, దేవుని తీర్పునకు ఒక నిదర్శనం. ఒకవేళ ఆ ప్రవక్తే దేవుని సందేశాన్ని స్వీకరిస్తే, దేవుడు అతనికి బహూకరిస్తాడు. ఒకవేళ తిరస్కరిస్తే, దేవుడు అతనిని శిక్షిస్తాడు. ఇది దేవుడు తన ప్రవక్తను అన్నివైపుల నుండి ఆవరించి ఉన్నాడు అనటానికి ఒక నిదర్శనం. అంతే కాకుండా ఒక ప్రవక్త దేవుని యొక్క అనేకమైన నిదర్శనాలను కలిగి ఉంటాడు. వాటిని ఆయన తన జాతీయ్యులకు చూపిస్తాడు. అతని సందేశ కార్యక్రమం అనేక ఘట్టాల నుండి సాగి, చేరవసిన స్థాయికి చేరిపోయిన తరువాత అతని జాతీయ్యుల తీర్పును ఈ ప్రపంచంలోనే చేసివేయటం జర్గుతుంది. ఈ విధంగా ప్రజల విషయంలో తీర్పు

జర్గిపోయిుందంటే, ఆ ప్రజలందరికీ, సత్యం సంపూర్ణంగా అందించబడిందనే దాని అర్ధం.

*ఒక దైవ ప్రవక్త యొక్క సందేశ కార్యక్రమాన్ని ఈ క్రింది ఉదహరించిన మూడంచెల వారీగా విభజించవచ్చు:*

**1. సందేశ దశ. 2. విముక్తి/వలస పోవలసిన దశ.**

**3.తీర్పు జరిగిపోయే దశ.**

**ఈ మూడు దశలకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలను చర్చిద్దాం.**

1.సందేశ దశ: ఈ దశతోనే ప్రవక్తల ప్రచార కార్యక్రమం ప్రారంభమౌతుంది. ఈ సందర్భంగా దైవ సందేశహరులు దేవుని యొక్క ప్రత్యేకమైన సహాయంతో (వహీ/శృతి ద్వారా) సత్యానికి చుట్టిముట్టి ఉన్న అసత్యాన్ని, మూఢవిశ్వాసాలనూ, దురాచారాలనూ, ఖండిస్తూ, తాము పరిచయం చేస్తున్న

సత్యాన్ని నమ్మి, సన్మార్గం పొందవలసినదిగా పిలుపునిస్తారు. ఒకవేళ ఆ ప్రవక్తల యొక్క జాతీయ్యులు ఈ సత్యాన్ని గనుక నమ్మకపోతే, ఇహ-పరాలలో నష్టాన్ని ఎదుర్కొనవలసి వస్తుందని తీవ్రంగా హెచ్చరిస్తారు. ఈ సందర్భంగా సత్యతిరస్కరులు పెట్టే బాధలను గాని, వారి దుశ్చర్యలను గాని ఏ ప్రవక్త కూడా ఎదుర్కొనకుండా సహిస్తూ ఉంటాడు. అంతే కాకుండా ప్రజలను సన్మార్గం పై  నడవమని బుజ్జగిస్తూ సాయశక్తులా  కృషి చేస్తాడు.

ఈ సందేశ ఘట్టంలో ప్రధానంగా సమాజంలో గొప్పవారుగా చెలామణి అవుతున్న నాయకులే ప్రవక్త యొక్క ప్రధాన సంబోధితులు అవుతారు. రాజకీయంగా, సామాజికంగా, జ్ఞాన పరంగా పలుకుబడి ఉన్న నాయకులను సగౌరవంగా ఈ సత్యం వైపునకు పిలవటం జర్గుతుంది.

ఈ విషయాన్ని చక్కగా అమీన్ అహ్సాన్ ఇస్లాహి గారు వివరిస్తూ...

హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం, మొట్టమొదటి సారిగా స్వయంగా తన కుటుంబీకులనే, తన వంశం వారినే ఈ సత్య సందేశం వైపునకు ఆహ్వానించారు. తన కుటుంబీకుల చేతులలో అప్పటి ధార్మిక విషయాల పగ్గాలు ఉండేవి. తరువాత ఇబ్రాహీం (అలై) వారు ఆ దేశాన్ని పరిపాలించే రాజును ఈ ధర్మం వైపునకు ఆహ్వానించారు. ఆ రాజు తన రాజకీయ్య పగ్గాలను తన చేతిలో కలిగి ఉండీ, తన దేశ ప్రజల చావు-బ్రతుకులు కూడా తన ఆధీనంలో ఉన్నాయని భావించేవాడు. అలాగే దేవుడు మూసా అలైహిస్సలాం వారిని కూడా మొదటిగా సందేశాన్ని ఆ దేశ రాజైన ఫిరౌన్ కు అందించమని ఆదేశించాడు. యేసు కూడా యూదుల ధార్మిక పండితులనే ఈ సత్యం వైపునకు ఆహ్వానించారు. అలాగే సందేశహరులైన నూహ్, హూద్, సాలెహ్,

మొదలైన వారి వివరాలు కూడా ఖురాన్ గ్రంధంలో ప్రస్తావించటం జరిగింది. ఈ దైవ ప్రవక్తలందరూ కూడా మొట్టమొదటిగా ఆ సమాజంలో పెద్దరికాన్ని కలిగి ఉన్న వారితోనే తమ సందేశాన్ని ప్రారంభించారు. అలాగే, తమ తమ కాలాల్లో అధికారమదంలో ఉండి, దురహంకారానికి గురై, తప్పుడు భావాలు కలిగి నిద్రావస్తలో ఉన్న వారిని తీవ్రంగా ఖండిస్తూ, హెచ్చరించేవారు. చివరిగా దేవుడు, ప్రవక్త ముహమ్మద్ (స) ను ప్రభవింపచేసి ముందుగా తన బంధువులను హెచ్చరించమని ఆజ్ఞాపించాడు. ప్రవక్త వారి బంధువులు రాజకీయంగా మతపరంగా అరేబియా అంతటికీ పితృస్వామ్య వ్యవస్థలో నాయకులు. మరియు వారి పలుకుబడి కారణంగా అన్ని విషయాల్లో అరేబియా అంతటినీ నడిపించేవారు.

ఈ సందేశ ఘట్టం యొక్క రెండవ భాగంలో ఈ దైవ సందేశ హరులు తమ ప్రచార కార్యక్రమాన్ని మరింత అధికం చేసి దాని

పరిధులను విస్తృత పరచేవారు. ఎప్పుడైతే ఈ సందేశం రోజురోజుకూ విస్తరిస్తూ పోతుందో, అప్పుడు ఈ నాయకులు కూడా తమ పన్నాగాలను పన్నుతూ ఏదోవిధంగా నయాన-భయాన ఈ సందేశాన్ని ఆపటానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

ఈ విధంగా ప్రచార కార్యక్రమం  తన పూర్తి స్థాయికి చేరుకొని, సత్యాన్ని తిరస్కరించటానికి ఏమాత్రం అవకాశం లేకుండా చేసింది.

2.విముక్తి/వలస చేయవలసిన దశ: సందేశ దశ ముగిసిన వెంటనే – ప్రజలు సత్యాన్ని స్వీకరించటానికి ఎంత సమయం ఇవ్వాలో అది దేవునికే తెలుసు గనుక , అతని ఆజ్ఞ అయిన తరువాత –ఒక దైవ ప్రవక్త తన జాతీయ్యులతో తెగతెంపులు చేసుకొని “నేను మీతో విముక్తి పొందుతున్నాను” అని ప్రకటిస్తూ

వలస పోవటం జర్గుతుంది. అప్పుడు దేవుడు ఈ ఇరువర్గాల మధ్య తన తీర్పును చేసివేస్తాడు.

*దైవ ప్రవక్తలు తమ జాతీయ్యులతో తెగతెంపులు చేసుకొని వలస పోయే విషయంలో రెండు ప్రధానమైన విషయాలు మనం గమనించగలం.*

**మొదటిది:** ఒక దైవ ప్రవక్త వలస పోతున్నాడంటే, ఆ జాతికి నూకలు చెల్లాయని అర్ధం. సత్యం వైపునకు పిలవటానికి పాటించవలసిన పద్దతులన్నీ సంపూర్ణంగా పాటించినప్పుడు వలస పోవటానికి ముందుగా ఒక ప్రవక్త వారి సమక్షంలోనే ఉంటాడు కాబట్టి వారికి కొంత విడుపునివ్వటం జర్గుతుంది. అలాంటి సందర్భంలోనే అరేబియా ముష్రిక్కులు (బహుదైవా రాధకులు) ముహమ్మద్ ప్రవక్త వారిని ఉద్దేశించి “నీవు మాకు భయపెడుతున్న ఆ దేవుని శిక్షను మా మీదకు తీసుకొని రా” అని సవాలు విసిరారు. అప్పుడు అల్లాహ్ ...

“ఓ ప్రవక్తా! నీవు వారి మధ్య ఉన్నంత కాలం అల్లాహ్ వారిపైకి శిక్షను తీసుకొని రాడు” -8:33

**రెండవది:** ఏ దైవ ప్రవక్త కూడా వలస పోయే నిర్ణయాన్ని తాను స్వతహాగా తీసుకోవటానికి హక్కు లేదు. ఎందుకంటే, ఒక జాతి విశ్వసించటానికి ఎంత సమయం కావాలో అది దేవునికే తెలుసు గనుక. “ఈ జాతి విశ్వసించటానికి కావలసిన సమయం పూర్తయి పోయింది. కనుక నీవు వలస వెళ్లిపో” అని దేవుని ఆజ్ఞ అయ్యేంత వరకు ఒక దైవ ప్రవక్త తన సందేశ కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే ఉండాలి. ఎన్ని చేదు అనుభవాలు ఎదురైనా సరే.

ప్రవక్త యూనుస్ అలైహిస్సలాం వారు తాను స్వంత నిర్ణయం తీసుకొని తన జాతీయ్యులతో తెగతెంపులు చేసుకొని వలస పోయారు. చివరికి దేవునిచేత ఒక చిన్నపాటి శిక్షకు గురయ్యారు.

“చేప వానిని కూడ మేము అనుగ్రహించము. అతను కోపంతో వెళ్లిపోయినప్పటి సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో. దానికి మేము సంజాయిషీ అడగబోమని అతను భావించాడు. చివరకు అతను అగాధమైన చీకట్లల్లో నుండి ఇలా మొరపెట్టుకున్నాడు “నీవు తప్ప దేవుడు లేనే లేదు. నీవు పరిశుద్ధుడవు. నిస్సందేహంగా నేను తప్పు చేశాను.” -21:87

అలాగే ప్రవక్త ముహమ్మద్ను కూడా అల్లాహ్, “నా ఆజ్ఞ వచ్చే వరకు సహనం వహించు. యూనుస్ మాదిరిగా కావద్దు” అని హెచ్చరిస్తున్నాడు.

“సరే నీ ప్రభువు ఆజ్ఞ వెలువడే వరకు సహనం వహిస్తూ ఉండు. చేపవాని (యూనుస్) మాదిరిగా వ్యవహరించకు. అతడు మొర పెట్టుకున్నప్పుడు దుఖ్ఖములో మునిగి ఉన్నాడు”. -68:48

మరోవైపు హజ్రత్ ఇబ్రాహీం (అ) తన మేనల్లుడు ప్రవక్తా లూత్ (అ) జాతి విషయంలో దేవునితో వివాదపడుతూ ఆ జాతికి మరికొంత సమయం ఇవ్వమని అర్థించారు. ఒక్క సత్యవంతుడు కూడా ఆ శిక్షకు గురికాకూడదని. ఈ విషయం ఖురాన్ గ్రంథం 11:74లో సూచన ప్రాయంగా ఉంటే, బైబిల్లో ఈ క్రింది విధంగా చాలా వివరంగా ఉంది.

23 అప్పుడు అబ్రాహాము సమీపించి
యిట్లనెనుదుష్టులతోకూడ నీతి మంతులను
నాశనము చేయుదువా?

24 ఆ పట్టణములో ఒకవేళ ఏబదిమంది
నీతిమంతులుండినయెడల దానిలోనున్న
యేబదిమంది నీతి మంతుల నిమిత్తము ఆ
స్థలమును నాశనము చేయక కాయవా?

25 ఆ చొప్పున చేసి దుష్టులతో
కూడ నీతి మంతులను చంపుట నీకు
దూరమవునుగాక. నీతిమంతుని దుష్టు
నితో సమముగా ఎంచుట నీకు దూరమవు
గాక. సర్వలోకమునకు తీర్పు తీర్చువాడు
న్యాయము చేయడా అని చెప్పినప్పుడు

26 యెహోవాసొదొమ పట్టణములో
ఏబదిమంది నీతిమంతులు నాకు
కనబడినయెడల వారినిబట్టి ఆ
స్థలమంతటిని కాయుదుననెను

27 అందుకు అబ్రాహాముఇదిగో ధూళియు
బూడిదెయునైన నేను ప్రభువుతో మాటలాడ
తెగించుచున్నాను.

28 ఏబదిమంది నీతిమంతులలో ఒకవేళ
ఐదుగురు తక్కువైతే ఐదుగురు తక్కువై
నందున ఆ పట్టణమంతయు నాశనము
చేయుదువా అని మరల అడిగెను.
అందుకాయన అక్కడ నలుబది యైదు
గురు నాకు కనబడినయెడల నాశనము
చేయననెను;

29 అతడింక ఆయనతో
మాటలాడుచుఒకవేళ అక్కడ
నలుబదిమందియే కనబడుదురేమో
అనినప్పుడు ఆయనఆ నలుబదిమందిని
బట్టి నాశనముచేయక యుందునని చెప్పగా

30 అతడు ప్రభువు కోపపడనియెడల
నేను మాటలాడెదను; ఒకవేళ అక్కడ
ముప్పదిమందియే కన బడుదురేమో
అనినప్పుడు ఆయన అక్కడ ముప్పదిమంది
నాకు కనబడినయెడల నాశనము చె

31 అందు కతడుఇదిగో ప్రభువుతో
మాటలాడ తెగించితిని; ఒకవేళ అక్కడ
ఇరువదిమంది కనబడుదురేమో అని
నప్పుడు ఆయన ఆ యిరువదిమందినిబట్టి
నాశనము చేయ కుందుననగా

32 అతడు ప్రభువు కోపపడనియెడల
నే నింకొకమారే మాటలాడెదను; ఒకవేళ
అక్కడ పదిమంది కనబడుదురేమో
అనినప్పుడు ఆయన ఆ పదిమందినిబట్టి
నాశనము చేయక యుందుననెను.

-ఆది కాండము 18:23-32

III.తీర్పు చేసివేసే దశ: ఈ దశ ఒక దైవ ప్రవక్త యొక్క సందేశ కార్యక్రమానికి చివరి ఘట్టం. ఇక్కడ నుండి విశ్వసించిన వారు, అవిశ్వాసులతో తెగతెంపులు చేసుకొని, వేరుపడిపోయి, ఒక క్రొత్త సంఘంగా ఏర్పడుతారు. అలాగే ఆ యొక్క ప్రవక్త తన జాతీయ్యుల తలరాతను నిర్ణయిస్తాడు. గత పంక్తులలో మనం చర్చించినట్లు ఈ ఘట్టంలో దేవుడు ఆ జాతీయ్యులను సమూలంగా నిర్మూలించి, తన ప్రతిచర్యా కార్యక్రమాన్ని ముగిస్తాడు.

*అవిశ్వాసులను శిక్షించటం అనే కార్యక్రమం అక్కడున్న పరిస్థితులను బట్టి రెండు విధాలుగా ఉంటుంది. దానికి సంబంధించిన సమాచారం మనం ఖురాన్లో చూడగలం.*

మొదటిది: ఒకవేళ అప్పటి ప్రవక్తకు తగినంత అనుచరులుగానీ, మరోచోటుకు పోయి జీవించటానికిగాని అలాగే రాజకీయ ప్రాబల్యం

గాని లేని పరిస్థితులలో దేవుడు ఆ ప్రవక్తను మరియు అతని అనుయాయులను అవిశ్వాసుల జాతినుండి వేరుచేసి, ఒక శాంతియుతమైన ప్రదేశానికి వలస పొమ్మని ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు ఆ అవిశ్వాసుల జాతిని అనేకమైన ప్రకృతి విపత్తుల ద్వారా సర్వనాశనం చేసిపేస్తాడు. ఈ విషయాన్ని మనం ఖురాన్ గ్రంథంలో చూడగలం.

"చివరికి ప్రతీవాణ్ణీ మేము అతని పాపానికి గాను పట్టుకున్నాము. తరువాత వారిలోని కొందరిపైకి మేము రాళ్ళు విసిరే పెనుగాలిని పంపాము. మరికొందరిని ఒక భయంకరమైన ప్రేలుడు కబళించింది. ఇంకా కొందరిని మేము భూమిలో కూరుకుపోయేలా చేశాము. మరికొందరిని ముంచివేసాము. అల్లాహ్ వారికి అన్యాయం చేయలేదు. వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు". -29:40

అలాగే, హూద్ అలైహిస్సలాం జాతి ఆద్, స్వాలెహ్ అలైహి స్సలాం జాతి సమూద్, నూహ్ జాతి, లూత్ జాతి, షుఐబ్ జాతి, ఇంకా మొదలైన జాతులు తమ ప్రవక్తలను తిరస్కరించినప్పుడు దేవుడు వారిని అనేకమైన ప్రకృతి విపత్తుల ద్వారా నిర్మూలించాడు. దీనికి సంబంధించి మరింత సమాచారం మనకు 54వ అధ్యాయంలో దొరుకుతుంది. మూసా అలైహిస్సలాం వారి విషయంలో ఇస్రాయీల్ ప్రజలు మాత్రం తిరస్కృంచలేదు. కాబట్టి వారు రక్షించబడ్డారు. కానీ ఫిరౌన్, అతని అనుచరులు తిరస్కరించారు కాబట్టి వారు నాశనం చేయబడ్డారు. అలాగే యూనుస్ జాతివారు ముందు తిరస్కరించినా, తరువాత విశ్వసించారు కాబట్టి దేవుని శిక్షనుండి రక్షింపబడ్డారు.

“ఒక నగరం శిక్షను చూసి విశ్వసించం అనే విషయమూ, ఇంకా దాని విశ్వాసం దానికి లాభదాయకం కావడం అనే ఉదాహరణా,

ఎక్కడైనా ఉందా ఒక్క యూనుస్ జాతి తప్ప? (అలాంటి ఉదాహరణ లేదు) ఆ జాతి విశ్వసించగానే, మేము దానిపై నుండి ఇహలోక జీవితంలో అవమానకరమైన శిక్షను తొలగించాము. దానికి కొంత కాలం వరకు జీవితాన్ని అనుభవించే అవకాశం కలుగజేశాము". -10:98

**రెండవది:** ఈ విధానంలో అప్పటి దైవ ప్రవక్త తగినంత అనుచర గణాన్ని సంపాదించుకుని మరియు మరొక చోటికి వలస పోయి అక్కడ తన రాజ్యాన్ని స్థాపించే స్థాయికి చేరుకుంటాడు. ఇదంతా దేవుని తరుపునుండి జరుగుతుంది. ఈ విధానంలో దైవ ప్రవక్త మరియు అతని అనుయాయులు తమ అవిశ్వాస జాతీయ్యులను బంధించి తమ ఆధీనంలో ఉంచుకోనూగలరు, అలాగే ఒకవేళ వారు సత్యాన్ని స్వీకరించకపోతే అంతమొందించనూ గలరు. అలాగే తన సందేశాన్ని విశ్వసించిన తన అనుయాయులకు ఆత్మప్రక్షాళనా కార్యక్రమాన్ని ప్రారంభించి,

వారికి బాహ్యాంతర చెడు శక్తులపై ఎలా ప్రాబల్యం సాధించాలో అనే ఒక శిక్షణా కార్యక్రమాన్ని కూడా నిర్వహించటం జరుగుతుంది. ఈ మధ్య ఉన్న కొద్దిపాటి కాలంలో ఈ అవిశ్వాసులకు కొంత గడువు ఇవ్వటం జరుగుతుంది. బహుశా వారు సత్యాన్ని అంగీకరిస్తా రేమోనని. అప్పుడు ఆ ప్రవక్త ఆ దేశంపై సర్వాధికారాలను సంతరించుకొని తన ఆధీనంలో తెచ్చుకుంటాడు. ఎప్పుడైతే తనను అనుసరించే వారు సంపూర్ణంగా యుద్ధవీరులుగా శిక్షణ పొందుతారో, అప్పుడు ఈ అవిశ్వాసులకు చివరిసారిగా హెచ్చరించి, వారు తమ పూర్వ వైఖరిని మానుకోకపోతే అప్పుడు వారిపై యుద్ధం ప్రకటించటం జరుగుతుంది. అప్పుడు విశ్వాసుల వర్గం విజయాన్ని సాధించి, తమ శత్రువులను పూర్తిగా నిర్వీర్యం చేయటం జరుగుతుంది. మనం గతంలో చర్చించుకున్నట్లు మొదటి విధానంలో అవిశ్వాసులపై దైవ శిక్ష ప్రకృతి పరంగా సంభవిస్తే, ఈ రెండవ విధానంలో దైవ విశ్వాసుల ఖడ్గాల ద్వారా

సంభవిస్తుంది. ముహమ్మద్ ప్రవక్త ద్వారా జరిగింది ఈ రెండవ విధానం ద్వారానే. అతని శత్రువులు ముస్లిం యోధుల ఖడ్గాల ద్వారా హతమార్చబడ్డారు. చివరికి మక్కా విజయం లభించింది. అలాగే మిగిలి ఉన్న ఇతర అవిశ్వాసులు కూడా ఈ సత్యాన్ని స్వీకరించటం జరిగింది. (ఈ వివరాలు మరొక సందర్భంలో చర్చిద్దాం) ఈ రెండవ రకం దైవ శిక్షకు సంబంధించి ఖురాన్ ఈ విధంగా చెబుతుంది:

"తమ వాగ్దానాలను భంగంచేస్తూ ఉన్నవారితో, సందేశహరుణ్ణి దేశం నుండి బహిష్కరించాలని నిర్ణయించుకున్నవారితో మీరు యుద్ధం చెయ్యరా? అతిక్రమణను ప్రారంభించింది వారే. మీరు వారికి భయపడుతున్నారా? మీరు గనుక విశ్వాసులే అయితే, మీరు భయపడటానికి అల్లాహ్యే ఎక్కువ అర్హుడు. కనుక వారితో యుద్ధం చేయండి. అల్లాహ్ మీ చేతుల ద్వారా వారిని శిక్షిస్తాడు.

వారిని నీచులుగా,హీనులుగా చేసి అవమానం పాలుచేస్తాడు. ఇంకా వారికి ప్రతికూలంగా మీకు సహాయం చేస్తాడు". -9:13-14

"కనుక యదార్థం ఏమిటంటే, వారిని మీరు చంపలేదు. వారిని అల్లాహ్ చంపాడు. ప్రవక్తా! నీవు విసర లేదు. అల్లాహ్ విసిరాడు. ఇది (ఈ పని కొరకు విశ్వాసుల చేతులు వినియోగింపబడటం) ఎందుకంటే, అల్లాహ్ ముస్లింలను ఒక మంచి పరీక్ష గుండా విజయవంతంగా దాటించదలిచాడు. నిశ్చయంగా అల్లాహ్ అన్నీ వినేవాడూ, అన్నీ తెలిసినవాడూనూ". -8:17

మరోమాటలో చెప్పాలంటే, ఎప్పుడైతే ఆయా ప్రవక్తల సమక్షంలో ఉన్న ప్రజలు, సత్యం వారికి సంపూర్ణంగా నిరూపించబడినప్పటికీ ఆ సత్యాన్ని తిరస్కరించిన తరువాతనే స్వయంగా దేవుడే వారిని శిక్షకు గురిచేసేశాడు. ఆ శిక్షను అమలు పరిచే విషయంలో

ఆనాటి దైవ ప్రవక్తనూ, మరియు అతని  అనుయాయులను దేవుడే తన కార్యసాధకులుగా వాడుకొని, వారిచేతనే ఈ సత్యధిక్కారులను సర్వనశనం చేసేశాడు.

మనం గతంలో చెప్పుకున్న విధంగా ఒక ప్రవక్త యొక్క జాతిని అవమానానికి గురిచేయ్యటం మరియు దానిని శిక్షించడం రెండు విధాలుగా జరుగుతుంది. ఏకేశ్వర వాదాన్ని, తమ ప్రవక్తను నమ్మినవాళ్లు రక్షింపబడి, ఎవరైతే దైవేతరారాధనకు ఒడిగట్టి, తమ ప్రవక్తను తిరస్కరించినవారు దైవశిక్షకు బలైపోతారు. ఎందుకంటే, దైవేతరారాధన ఎన్నటికీ క్షమించరాని నేరం.

"అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను ఇష్టపడిన వారికొరకు క్షమిస్తాడు. ఇతరులను అల్లహ్కు భాగస్వాములుగా చేసేవాడు,

ఎంతో ఘోరమైన అబద్ధాన్ని కల్పించాడు అన్నమాట. ఎంతో తీవ్రమైన పాపపు మాట అన్నాడు అన్నమాట". -4:48

ఇదే విధంగా యూదుల ధర్మశాస్త్రం ప్రకారం కూడా ఈ దైవేతరారాధకులను ఈ లోకంలోనే మరణ శిక్ష విధించాలి.

3 అది నీకు తెలుపబడిన తరువాత నీవు
విని బాగుగా విచారణ చేయవలెను. అది
నిజమైనయెడల, అనగా అట్టి హేయక్రియ
ఇశ్రాయేలీ యులలో జరిగియుండుట
వాస్తవమైనయెడల

4 ఆ చెడ్డ కార్యము చేసిన పురుషు నిగాని
స్త్రీనిగాని నీ గ్రామ ముల వెలుపలికి తీసికొని
పోయి రాళ్లతో చావగొట్ట వలెను.

5 ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటమీదనే
చావతగిన వానికి మరణశిక్ష విధింపవలెను.

-ద్వితి.కా.17:2-5

ఈ విధంగా ఇస్రాయేలీయులు (బనీ ఇస్రాయీల్) వారు సమస్త బహుదైవోపాసకుల జాతులను ఏ మాత్రం విడిచి పెట్టకుండా చంపేయమని ఆజ్ఞాపించబడ్డారు.

1 నీవు స్వాధీనపరచుకొనబోవు
దేశములోనికి నీ దేవు డైన యెహోవా
నిన్ను చేర్చి బహు జనములను,
అనగా సంఖ్యకును బలమునకును
నిన్ను మించిన హిత్తీయులు
గిర్గాషీయులు అమోరీయులు
కనానీయులు పెరిజ్జీయులు
హివ్వీయులు యెబూసీయులను
ఏడు జనములను నీ యెదుటనుండి
వెళ్లగొట్టిన తరువాత

2 నీ దేవుడైన యెహోవా వారిని నీకప్ప
గించునప్పుడు నీవు వారిని హతము
చేయవలెను, వారిని నిర్మూలము
చేయవలెను. వారితో నిబంధన
చేసికొనకూడదు, వారిని కరుణింప కూడదు,

3 నీవు వారితో వియ్యమందకూడదు, వాని
కుమారునికి నీ కుమార్తె నియ్యకూడదు,
నీ కుమారునికి వాని కుమార్తెను
పుచ్చుకొనకూడదు.

4 నన్ను అనుసరింప కుండ ఇతర
దేవతలను పూజించునట్లు నీ కుమారుని
వారు మళ్లించుదురు, అందునుబట్టి
యెహోవా కోపాగ్ని నీమీద రగులుకొని
ఆయన నిన్ను త్వరగా నశింపజేయును.

5 కావున మీరు వారికి
చేయవలసినదేమనగా, వారి బలిపీఠ
ములను పడద్రోసి వారి విగ్రహములను
పగులగొట్టి వారి దేవతాస్తంభములను
నరికివేసి వారి ప్రతిమలను అగ్నితో
కాల్చవలెను.

-ద్వితి.కా.7:1-5

అలాగే పాత నిబంధనలో, ఏ జాతులైతే విశ్వాసులకు లొంగి ఉంటారో, వారిని శిక్షించకుండా విడిచిపెట్టడం జరిగినట్లు మనం చూడగలం. ఇదే విషయాన్ని ఖురాన్ గ్రంధం కూడా బలపరుస్తుంది. ఒకవేళ వారు మూసా ధర్మ శాస్త్రాన్ని ఒప్పుకొని జీవిస్తాము అంటే, అప్పుడు వారికి మరణ శిక్ష విధించకుండా విడుపునివ్వడం జరుగుతుంది.

10 యుద్ధము చేయుటకు మీరొక
పురముమీదికి సమీ పించునప్పుడు
సమాధానము నిమిత్తము రాయబారమును
పంపవలెను. సమాధానమని అది నీకు
ఉత్తర మిచ్చి

11 గుమ్మ ములను తెరచినయెడల దానిలో
నున్న జనులందరు నీకు పన్ను చెల్లించి నీ
దాసులగుదురు.

12 అది మీతో సమా ధానపడక యుద్ధమే
మంచిదని యెంచినయెడల దాని
ముట్టడివేయుడి.

13 నీ దేవుడైన యెహోవా దాని నీ
చేతి కప్పగించునప్పుడు దానిలోని
మగవారినందరిని కత్తివాత హతము
చేయవలెను.

14 అయితే స్త్రీలను చిన్నవారిని
పశు వులను ఆ పురములో నున్నది
యావత్తును దాని కొల్ల సొమ్మంతటిని నీవు
తీసికొనవచ్చును; నీ దేవుడైన యెహోవా
నీకిచ్చిన నీ శత్రువుల కొల్లసొమ్మును నీవు
అనుభవించు దువు.

15 ఈ జనముల పురములు గాక నీకు
బహు దూర ముగా ఉండిన సమస్త
పురములకు మాత్రమే యీలాగున
చేయవలెను.

-ద్వితి.కా.20:10-15

అలాగే ఇస్రాయేలీయులు ఒక జాతిగా మాత్రం తుడిచి వేయబడలేదు. ఎందుకంటే, వారు ముఖ్యంగా ఏకేశ్వరోపాసకులు. యేసు అనుచరులచే తరచుగా వారు అవమానానికి గురిచేయ బడుతూనే ఉంటారు. ప్రళయం వరకు కూడా. ఈ విషయం మనం ఈ క్రింది ఖురాన్ వాక్యంలో చూడవచ్చు.

“అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు: ‘ఈసా! నేను నిన్ను తిరిగి నా వద్దకు రప్పించుకుంటాను. నా వైపునకు లేపుకుంటాను. నిన్ను తిరస్కరించిన వారినుండి (అంటే వారి చెడు సాంగత్యం నుండి వారి కలుషిత పరిసరాలలో వారితో కలసి ఉండటం నుండి కాపాడి) నిన్ను పరిశుద్ధునిగా చేస్తాను. నిన్ను అనుసరించిన వారికి నిన్ను తిరస్కరించిన వారిపై ప్రళయం వరకు ఆధిక్యాన్ని ప్రసాదిస్తాను. చివరకు మీరంతా నా వద్దకే మరలి వస్తారు”.-3:55

ఇక్కడ మనకు ఒక సందేహం రావచ్చు. అదేమిటంటే, గ్రంథ ప్రజలు ముఖ్యంగా క్రైస్తవులు ఎందుకు ఏకేశ్వరోపాసకులుగా పరిగణింపబడతారు? వారు త్రిత్వాన్ని నమ్ముతారు. అంటే త్రిత్వం కూడా బహుదైవోపాసన క్రిందికే వస్తుందికదా! అని. దానికి సమాధానం ఏమిటంటే, క్రైస్తవులు ముఖ్యంగా ఏకేశ్వరోపాసనను అనుసరించేవారే. దానికి సంబంధించి ఈ క్రింది బైబిల్ వాక్యంలో...

29 అందుకు యేసుప్రధానమైనది ఏదనగాఓ ఇశ్రాయేలూ, వినుము; మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు.

30 నీవు నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణవివేకముతోను, నీ పూర్ణబలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలె ననునది ప్రధానమైన ఆజ్ఞ.

-మార్కు సువార్త 12:29-30

బహుదైవోపాసన లాంటి కొన్ని పనులకు పాల్పడుతున్నప్పటికీ క్రైస్తవులు ఎన్నటికీ బహుదైవోపాసనను అనుమతించరు. ఒకవ్యక్తి బహుదైవోపాసనను సంపూర్ణంగా సమర్థిస్తున్నప్పుడే అతడు బహుదైవోపసకునిగా పరిగణింపబడతాడు. ఒకవ్యక్తి తనకుతాను ఏకేశ్వరోపాసకునిగా ప్రకటించుకుంటున్నప్పుడు,

అతని కొన్ని చేష్టలు బహుదైవోపాసన లాంటివి అయిఉన్నప్పటికీ అతనిని మనం బహుదైవోపాసకుడు అని చెప్పలేము. దానికి కారణం ఏమిటంటే, ఒకవ్యక్తి బహుశా ఏదో ఒక విషయంలో అజ్ఞానం వలన తప్పు చేయవచ్చు. ప్రతీ క్రైస్తవుడు –ఇప్పటి వారైనా లేక యేసు కాలం నుండి వస్తున్న వారైనా- ఎవరైనా సరే, ఎట్టి పరిస్థితులలోనూ బహుదైవారాధనను సమర్ధించరు. త్రిత్వమ్ అనేది ఏకేశ్వరోపాసనలో భాగంగానే వారు భావిస్తారు. ముస్లింలైతే వీరితో ఏకీభవించకపోవచ్చుగాక, వారు బహుదైవోపాసనను ప్రకటిస్తే తప్ప వారు ఏకేశ్వరోపాసకులుగా ప్రకటిస్తున్నప్పటికీ బహుదైవోపాసనకు ఒడిగడుతున్నారు అని మాత్రమే చెప్పాలి. వీరిని – పుణ్యపురుషుల సమాధులను దర్శించి, తమ కోరికలను తీర్చమని అర్ధించే ఒక ముస్లిం సమూహంతో పోల్చవచ్చు. ఇటువంటి ముస్లింలు బహుదైవోపశకులుగా పరిగణింపబడరు. ఇటువంటి వారిని మనం “ ఏ ఏకేశ్వరోపాసనను నీవు

సమర్థిస్తున్నావో, ఆ ఏకేశ్వరోపాసనకు విరుద్ధమైనదే నీవు చేస్తున్న ఈ సమాధి ఆరాధనా పద్ధతి” అని మనం గద్దించవచ్చు. అదేవిధంగా క్రైస్తవులు కూడా బహుదైవోపాసకులుగా పరిగణింప బడరు. అదేవిధంగా మనం క్రైస్తవులను కూడా “ఏ ఏకేశ్వరోపాసనను మీరు సమర్థిస్తున్నారో, మీరుచేసే త్రిత్వ ఆరాధన కూడా దానికి విరుద్ధమైనదే” అని చెప్పాలి.

అందుకే ఖురాన్ ఈ గ్రంథ ప్రజలను ఎట్టి పరిస్తితులలోనూ బహుదైవారాధకులు అని సంబోధించలేదు. వారు ఘోరమైన బహుదైవారాధనను పోలిఉన్న అనేక కార్యాలు చేస్తున్నప్పటికీ. కేవలం ఇస్మాయీల్ వంశీయులనే ఖురాన్ బహుదైవారాధకులుగా నిర్ణయించింది. ఎందుకంటే వారు బాహాటంగా తాము బహుదైవారాధకులమని, అల్లాహ్ ఈ విధానాన్నే మాకు చూపించాడని, మేము ఈ బహుదైవారాధనకు

ధ్వజవాహకులమని, ఇది మా మతం అని ప్రకటించారు. అందుకే అల్లాహ్ వారిని ముష్రికూన్ (బహుదైవారాధకులు) అని ఖురాన్లో సంబోధించాడు.

## 4.ప్రవక్త ముహమ్మద్ వారి బోధనలలో దేవుని ప్రతిచర్యా విధానపు పరిపూర్ణత:

ఇప్పుడు మనం ప్రవక్త ముహమ్మద్ (స.అ.సం) వారు నిర్వహించిన తన సందేశ కార్యక్రమ వివిధ దశల రూపాలు, అలాగే సర్వశక్తిగల దేవుడు ప్రవక్త ముహమ్మద్ను తిరస్కరించిన అవిశ్వాసులను శిక్షించిన వివరాలను పరిశీలిద్దాం.

**I.సందేశ దశ:** ప్రవక్త ముహమ్మద్ తన నలభైయ్యవ యేట తనను ఆరాధించమని దేవునిచేత ఆజ్ఞాపించబడ్డారు. మక్కా పట్టణం అప్పుడు అరేబియా దేశానికి సాంఘికంగా, సాంస్కృతికంగా కేంద్రమై ఉండేది. ఏ విధంగానైతే దేవుడు తన సందేశ కార్యక్రమాన్ని ప్రారంభించాలి అనుకున్నప్పుడు తన ప్రవక్తను ఎన్నుకొని, ఆ ప్రవక్త నివసించే ప్రదేశానికి కేంద్రమైన పట్టణం నుండే ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభింపజేసేవాడో, అలాగే ప్రవక్త ముహమ్మద్ ను కూడా తన కేంద్ర పట్టణమైన మక్కా నుండే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించమని ఆజ్ఞాపించాడు.

"ప్రవక్తా! ఇదే విధంగా ఈ అరబ్బీ ఖురాన్‌ను మేము నీ వైపునకు వహీ ద్వారా పంపాము, నీవు జనపదాల కేంద్రం (మక్కా నగరం) హెచ్చరించాలనీ లోనూ దాని పరిసరాలలోనూ ఉండే ప్రజలను, సమావేశదినం గురించి వారిని భయపెట్టాలని. అది వచ్చే

విషయంలో ఏ మాత్రం సందేహం లేదు. ఒక వర్గం వారు స్వర్గానికి పోతారు, మరొక వర్గం వారు నరకానికి పోతారు". -42:7

ప్రవక్త ముహమ్మద్ తన సందేశ కార్యక్రమాన్ని పడమూడు సంవత్సరాలు మక్కాలోనే నిర్వహించారు. ముఖ్యంగా అతని ప్రధాన సంబోధితులు విగ్రహారాధకులు. వీరు మహా ప్రవక్త హజ్రత్ ఇస్మాయిల్ అలైహిస్సలాం వారి వారసులు. అలాగే గ్రంథ ప్రజలకు (యూదులు/క్రైస్తవులకు) కూడా ప్రవక్త ముహమ్మద్ వారు అనేక సందర్భాలలో సందేశం ఇస్తుండేవారు. ఈ భిన్నమైన ఇరువురు ప్రత్యర్థులే కాకుండా మరొక కపటుల వర్గం కూడా ఉండేది. వారిలో కొందరు మక్కాలోనూ, అలాగే మదీనా ఇస్లామియా ఉధ్యమం ఊపందుకొంటున్న సమయంలో విశ్వాసుల ముసుగులో మరికొందరు మదీనాలోనూ ఉండేవారు.

ముహమ్మద్ ప్రవక్తవారు ఈ మూడు వర్గాల వారి దుష్ట విశ్వాసాలను ఖండిస్తూ, సత్యానికి నిలివెత్తు నిదర్శనంగా నిలిచారు. ఖురాన్ పరిభాషలో దీనిని షహాదహ్ అని అంటారు.

"ఓ ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా చేసి, శుభవార్తను ఇచ్చే వానిగా, హెచ్చరిక చేసేవానిగా చేసి అల్లాహ్ అనుమతితో ఆయన వైపునకు పిలుపు ఇచ్చేవానిగా చేసి ప్రకాశించే దీపంగా చేసి పంపాము". -33:44-45 ప్రవక్త ముహమ్మద్ వారు హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం వారి అనేకమైన ధర్మాచారాలనూ, విశ్వాసాలనూ పునరుద్ధరింపచేసి, బహుదైవోపాసకులు కలుషితం చేసిన అనేకమైన ధర్మవిరుద్ధ ఆచారాలను ప్రక్షాళన చేశారు. అలాగే ఒకవ్యక్తి తాను చేసిన పనులకు దేవుని ముందు పరలోకంలో సమాధానం చెప్పుకోవలసి ఉంది అనే ఒక గొప్ప సత్యాన్ని వివరించేవారు.

ఇంకా విగ్రహారాధకులతో వారి మార్గ భ్రష్ట విశ్వాసాలను, ధర్మంలో వారు కల్పించిన కొత్త కొత్త పోకడల విషయంలో వారితో వాదోపవాదాలు చేస్తుండేవారు. ఏవిధమైనటువంటి ఆధారం లేనటువంటి వారి స్వకల్పిత మతాన్ని విడిచి పెట్టమని అనేక మార్లు వారిని కోరేవారు. దేవుడు తనతోపాటు ఇతర దేవుళ్ళను కూడా చేసుకొని ఉంటే, ఆ విషయం వారికి చెప్పి ఉండేవాడే. దేవుని అనుమతి లేకుండా వారు ఈ (సత్యధర్మ) విషయాలను తెలుసుకునే ఎటువంటి సాధనం కూడా కలిగిలేరు. అందుకే "బహుదైవారాధన అనేది దేవుడు నిర్ణయించిన పద్ధతి" అని వారు చెప్పడం అతి దారుణమైన అబద్ధం అని అల్లాహ్ ఖురాన్ లో తెలియపరుస్తున్నాడు. "యధార్థమేమిటంటే, వారు కేవలం ఊహలనూ, అనుమానాలను అనుసరిస్తున్నారు, తమ మనో వాంఛలకు దాసులై పోయారు". -53:23

ఏకేశ్వరోపాసనను వారు నిరాకరించిన కారణంగా వారు సత్యాన్ని బాహాటంగా తిరస్కరించారు. తరువార వారు రాబోయే ఆ పరలోకంలో నరక శిక్షకు బలి కావలసిన పరిస్థితి ఏర్పడింది.

“నా వాక్యాలు నీ వద్దకు వచ్చాయి. కానీ నీవు వాటిని తిరస్కరించావు, విర్రవీగావు. నీవు అవిశ్వాసులలోని వాడవు. ఈనాడు అల్లాహ్ కు అసత్యాన్ని ఆపాదించినవారి ముఖాలు ప్రళయం నాడు నల్లగా మారిపోవటాన్ని నీవు చూస్తావు. నరకంలో గర్విష్టులకు సరిపోయే స్థలం లేదా?”. -39:59-60

అదే సందర్భంలో గ్రంధ ప్రజలను కూడా శత్రుత్వంతో, అసూయతో కూడిన తమ ప్రవర్తనను మానుకొని, తమ గ్రంధంలో పేరుతో సహా చెప్పబడిన ఆ చివరి ప్రవక్తను విశ్వసించమని చెప్పడం జరిగింది.

“మీరు అల్లాహ్ తో అదైనా వాగ్దానం చేసివుంటే, ఆ వాగ్దానాన్ని నెరవేర్చండి. అల్లాహ్ సాక్షిగా చేసిన ప్రమాణాలను ధృడపరచిన తరువాత భంగపరచకండి. అల్లాహ్ మీ పనులన్నింటినీ ఎరుగును. స్వయంగా తాను శ్రమతో నూలు వడకి, తరువాత తానే దానిని ముక్కలుముక్కలుగా చేసిన స్త్రీ స్థితి వంటిది మీ స్థితి కాకూడదు. మీరు మీ ప్రమాణాలను మీ వ్యవహారాలలో పరస్పరం మోసగించుకోవటానికి పనిముట్లుగా చేసుకుంటారు. ఒక జాతి, రెండోజాతికంటే ఎక్కువగా లాభాలను పొందటానికి. వాస్తవానికి అల్లాహ్ ఈ ప్రమాణాల ద్వారా మిమ్మల్ని పరీక్షకు గురిచేస్తున్నాడు. తప్పకుండా ఆయన ప్రళయం నాడు మీ సమస్త అభిప్రాయాల భేదాల తత్వాన్ని మీకు విశదం చేస్తాడు”. -16:91-92

“మా కొరకు ఇహలోకాపు మేళ్ళనూ రాయండీ, పరలోకపు మేళ్లను కూడా రాయండి. మేము మీవైపునకే మరలాము”

సమాధానంగా ఇలా సెలవియ్యబడింది: “శిక్షను నేను కోరినవారికి విధిస్తాను. కానీ నా కారుణ్యం ప్రతి వస్తువునూ ఆవరించి ఉంది. నా పట్ల అవిధేయతకు దూరంగా ఉండేవారి కొరకూ, జకాత్ ఇచ్చేవారి కొరకూ, నా వాక్యాలను విశ్వసించేవారి కొరకూ నేను దానిని వ్రాస్తాను”. ఈ సందేశహరుణ్ణి, చదువనూ, వ్రాయనూ రాని ఈ ప్రవక్తను అనుసరించేవారు. అతని ప్రస్తావన వారికి తమ వద్ద ఉన్న తౌరాత్, ఇంజీల్ గ్రంధాలలో వ్రాయబడి లభిస్తుంది. అతను వారికి మంచిని ఆజ్ఞాపిస్తాడు. చెడు నుండి నిరోధిస్తాడు. వారికొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మ సమ్మతం చేస్తాడు. అపరిశుద్ధమైన వాటిని నిషిద్ధం చేస్తాడు. వారిపై మోపబడిఉన్న బరువులను దించుతాడు. వారు బంధింపడి ఉన్న శృంఖలాలను త్రెంచుతాడు. కనుక అతనిని విశ్వసించీ, సమర్థించీ అతనికి సహకరించీ, అతనితో అవతరింపచేయబడిన జ్యోతిని అనుసరించేవారు మాత్రమే సాఫల్యం పొందేవారు”. -7:156-157

“...నేను అల్లాహ్ను కాదని తీర్పు చెప్పే మరొకడికోసం అన్వేషించాలా, వాస్తవానికి ఆయన పూర్తి వివరాలతో మీ వద్దకు గ్రంథాన్ని పంపినప్పుడు? మేము గ్రంథం ఇచ్చిన (నీకు పూర్వం) వారికి తెలుసు, ఈ గ్రంథం నీ ప్రభువు తరఫునుండే సత్యం ఆధారంగా అవతరించిందని. కనుక నీవు శంకించేవారిలో చేరిపోకు”. -6:114

“అల్లాహ్ నుండి వారి వద్దకు ఇప్పుడు వచ్చిన గ్రంథం పట్ల వారి ప్రవర్తన ఎలా ఉంది? వారి వద్ద పూర్వం నుండే ఉన్న దైవ గ్రంథాన్ని ఈ గ్రంథం ధ్రువీకరిస్తున్నప్పటికీ, దీని రాకకు ముందు ‘అవిశ్వాసులపై విజయం ప్రసాదించు’ అని వారు ప్రార్థిస్తూ వచ్చినప్పటికీ, తీరా అది వచ్చిన తరువాత వారు దానిని గుర్తించి

కూడా తిరస్కరించారు. అటువంటి తిరస్కారులపై అల్లాహ్ శాపం అవతరించుగాక". -2:89

"గ్రంథ ప్రజలలోని పలువురు మిమ్మల్ని ఏదో ఒక విధంగా విశ్వాస మార్గం నుండి మరల్చి, మళ్ళీ అవిశ్వాస మార్గం వైపునకు తీసుకుపోదామని కోరుతున్నారు. సత్యం వారికి సుస్పష్టం అయినప్పటికీ వారి ఈ కోరికకు కారణం వారి మనస్సులలో ఉన్న అసూయ. అయితే అల్లాహ్ తన తీర్పును అమలుపరిచే వరకు మీరు సహించి, వారిని క్షమించండి. మీరు నిశ్చింతగా ఉండండి. అల్లాహ్ కు అన్నింటిమీద సర్వాధికారాలూ ఉన్నాయి". -2:109

"విశ్వాస వరం పొందిన తరువాత మళ్ళీ అవిశ్వాసాన్ని అవలంబించే ప్రజలకు అల్లాహ్ సన్మార్గం చూపుతాడనేది ఎలా

జరుగుతుంది? వాస్తవానికి ‘ఈయన ప్రవక్త అనే విషయం సత్యం’ అని వారే స్వయంగా సాక్ష్యమిచ్చారు. ఇంకా వారి వద్దకు స్పష్టమైన సూచనలు కూడా వచ్చాయి. అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు”. -3:86

ప్రారంభంలో ప్రవక్త ముహమ్మద్ (స.అ.సం) వారు తన వంశంలోని చాలా తక్కువ మందిని సంపాదించుకోగలిగారు. కానీ చాలా ఎక్కువ మంది మక్కా ప్రజలు మాత్రం ఈ సందేశాన్ని తిరస్కరించారు. ఐతే కొందరు మక్కా యువకులు మాత్రం ఈ సందేశాన్ని స్వీకరించారు. మక్కాలో ఉన్న ప్రముఖులు ఈ సందేశాన్ని ద్వేషించి, ఈ సందేశానికి విరోధంగా చేస్తున్న చర్యలను చూసి చాలా మంది, “ఈ కొత్త సందేశం అతి త్వరలోనే అతి దారుణమైన ముగింపునకు చేరుతుంది” అని భావించారు. ప్రవక్త ముహమ్మద్ను, అలాగే ఆయన అనుయాయులనూ ఈ అవిశ్వాసులు శారీరకంగానూ, మానసికంగానూ చాలా

హింసించారు. ఇటువంటి దారుణమైన పరిస్థితులలో తన బంధుమిత్రులను చాలా సంవత్సరాలు బయట పడకుండా దాచ వలసిన పరిస్థితి ప్రవక్త వారికి ఏర్పడింది. అనేక సంవత్సరాల కృషి తరువాత, ఎప్పుడైతే మక్కా ప్రజలు సత్యాన్ని తిరస్కరించడంలో హద్దులు దాటిపోయారో, అప్పుడు అల్లాహ్ ప్రవక్త వారిని ఈ మక్కా ప్రజలతో తెగతెంపులు చేసుకొమ్మని ఆజ్ఞాపించాడు.

**II.వలస పోయే దశ:** పదమూడు సంవత్సరాల సుదీర్ఘమైన సందేశ కార్యక్రమం గడచినప్పుడు సర్వస్పృష్టికర్త అయిన అల్లాహ్, ప్రవక్త ముహమ్మద్ తో "ఈ మక్కా విగ్రహారాధకులకు సత్యసందేశం సంపూర్ణంగా అందజేయబడింది" అని చెప్పడం జరిగింది. వారు కావాలనే ఈ సందేశాన్ని తిరస్కరించి, దేవునిచే శిక్షింపబడటానికి అర్హులైపోయారు. ఈలోగా మదీనా పట్టణం ఈ సత్యసందేశం

యొక్క ఛాయలలో వచ్చేసి, అక్కడి నాయకులు ఇస్లాం ధర్మాన్ని స్వీకరించేశారు. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ వారు తమవారిని విడిచిపెట్టి మదీనాకు వలస వెళ్ళిపొమ్మని దేవునిచే ఆజ్ఞాపించబడ్డారు. ఈ తెగతెంపులకు సంబంధించిన ప్రకటనను మనం ఈ క్రింది సూరా "కాఫిరూన్"లో చూడగలం.

"ఇలా ప్రకటించు. ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించను, అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించెవాణ్ణి కాను, అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు. మీ ధర్మం మీదే, నా ధర్మం నాదే". -109:1-6

ఈ పై ఖురాన్ వాక్యాలు ఖండించదగ్గవి గాని, సుతిమెత్తగా మందలించ దగ్గవి గాని కావు. – ఆహ్వానించ దగ్గవే. ఈ పదాల యొక్క అర్థం ఏమిటంటే, మక్కా వాసులకు తెలపటమే. పదమూడు సంవత్సరాల సుదీర్ఘమైన సందేశ ప్రబోధనను విని,

దాని సత్యతను, సమంజసతను తెలిసి కూడా మక్కా ఖురైషులు దానిని తిరస్కరించారు. వారికి ఈ సత్యాన్ని అన్ని విధాలుగా నిరూపించబడినప్పటికీ కేవలం మూర్ఖత్వంతో, మొండి పట్టుదలతో మాత్రమే ఈ సందేశాన్ని తిరస్కరించారు. ఈ సూరా యొక్క చివరి వాక్యం – దానిని మనం మెచ్చుకోవాలి – వారికి బ్రతిమాలుతూ నచ్చచెప్పడం కాదు గాని, ప్రవక్త తరుపున ఖరాఖండీగా తెగతెంపులు చేసుకొని, “మీ మొండి పట్టు కారణంగ మీరు తిరస్కరిస్తున్న దానికి సంభవించే చేదు పరిణామాలను ఎదుర్కొనటానికి సంసిద్ధంగా ఉండండి” అని వారిని హెచ్చరిం - చడం మాత్రమే.

ఇక గ్రంధ ప్రజల విషయానికి వస్తే, వారికి సందేశం ఇవ్వడం అనే ప్రక్రియ ఇంకా ముగిసిపోలేదు. ఎందుకంటే మదీనాలో చాలామంది ఈ గ్రంధ ప్రజలు ఉన్నారు కాబట్టి. ఈ మధ్యలో

ఆలోచించుకోవటానికి వారికి మరికొంత సమయం ఇవ్వబడింది. ఎందుకంటే, ఎప్పుడైతే సత్యాన్ని స్వీకరించడానికి ఇవ్వబడిన సమయం ముగిసిపోతుందో అప్పుడు పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడం జరిగింది. మరొక విధంగా చెప్పాలంటే, ఎప్పుడైతే ఈ గ్రంథ  ప్రజలకు సత్యసందేశాన్ని సంపూర్ణంగా మదీనాలో కూడా అందించడం జరిగిందో, అప్పుడే వారికి ఈ దేవుని తీర్పు గురించి అరేబియా కపటుల  మరియు విగ్రహారాధకులతో కలిపి హెచ్చరించడం జరిగింది.

***III.తీర్పు జరిగిపోయే దశ: ఇక చివరిలో జరిగిపోయే దేవుని ఆ తీర్పునకు సంబంధించిన వివరాలు చూద్దాం.***

**(1)** **దేవుని ఆశీర్వాదం:**  ప్రవక్త ముహమ్మద్ వారు మదీనా పట్టణానికి వలస వెళ్ళిపోయిన తరువాత మక్కా వాసులకు మరొక సారి ఒక అవకాసం ఇవ్వడం జరిగింది. సత్యసందేశాన్ని

వారికి సంపూర్ణంగా ఇచ్చినప్పటికీ వారు దానిని తిరస్కరించారు. ఆ తిరస్కారానికి గాను వారికి సంభవించే చేదు పరిణామాల గురించి పునరాలోచించుకోవటానికి. అదే సమయంలో మదీనాలో ఉన్న విశ్వాసులు, మక్కాలో ఉన్న అవిశ్వాసులపై దాడి చేయటానికి సన్నాహాలు చేసుకొంటున్నారు. 'మీ శత్రువులు మీపై ఎన్నటికీ విజయాన్ని సాధించలేరు' అని కూడా వారికి చెప్పడం జరిగింది.

"ఈ అవిశ్వాసులు ఈ సమయంలో మీతో యుద్ధానికి దిగి ఉన్నట్లయితే, నిశ్చయంగా వెన్నుచూపి పారిపోయేవారు. ఇక ఏ సహాయకుణ్ణి, ఏ రక్షకుణ్ణి పొంది ఉండేవారు కాదు. ఇది అల్లాహ్ సాంప్రదాయం. మొదటి నుండే వస్తూఉంది. మీరు అల్లాహ్ సాంప్ర-దాయంలో ఏ మార్పునూ చూడలేరు". -48:22-23

ఈ విధంగా విశ్వాసులు తమకు కలగనున్న విజయాన్ని గురించి శుభవార్తను అందుకున్నారు.

“మీలో విశ్వసించి మంచిపనులు చేసేవారికి అల్లాహ్ చేసిన వాగ్దానమేమిటంటే, ఆయన వారిని, వారికి పూర్వం గతించిన ప్రజలను చేసిన విధంగా, భూమిపై ఖలీఫాలు (ప్రతినిధులు)గా చేస్తాడు. అల్లాహ్ వారికై అంగీకరించిన వారి ధర్మాన్ని వారి కొరకు పటిష్టమైన పునాదులపై స్థాపిస్తాడు. వారియొక్క (ప్రస్తుత) భయస్థితిని శాంతిభద్రతలతో కూడిన స్థితిగా మారుస్తాడు. కనుక వారు నాకు దాస్యం చేయాలి, ఎవరినీ నాకు భాగస్వాములుగా చేయకూడదు. దీని తరువాత ఎవరైనా అవిశ్వాసానికి పాల్పడితే, అటువంటివారే హద్దులు మీరినవారు”. -24:55

అలాగే కొందరు మంచివాళ్లు కూడా కొన్ని లోపాల కారణంగా నేరస్తులైతే కొంత శిక్షను అనుభవించిన తరువాత వారు కూడా క్షమింపబడ్డారు.

“ఇంకా వ్యవహారం వాయిదావేయ్యబడిన ఆ ముగ్గురినికూడా ఆయన క్షమించాడు. ఇంత పెద్ద వైశాల్యం కలిగి ఉండి కూడా, భూమి వారికి ఇరుకై పోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమైపోయాయి. అల్లాహ్ నుండి తమను కాపాడుకోవటానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీలేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్ కనికరంతో వారివైపునకు మరలాడు. వారు ఆయన వైపునకు మరలి వచ్చేటందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడూ, కరుణించేవాడూనూ”

-9:118

అలాగే ఎవరైతే అల్ప విశ్వాసులు ఉన్నారో వారిని కూడా “ఒకవేళ మీరు క్షమాపణ వేడుకొని మీ నడవడికను సంస్కరించుకొని ఈ ధర్మంపై స్థిరంగా ఉంటే, దేవుడు తప్పకుండ క్షమిస్తాడు” అని చెప్పడం జరిగింది.

"తమ తప్పులను ఒప్పుకున్నవారు కొందరు ఉన్నారు. వారి ఆచరణ మిశ్రమమైనది. కొంత మంచీ, కొంత చెడూ. అల్లాహ్ వారిని మళ్ళీ కరుణించడం అనేది అసంభవమేమీ కాదు. ఎందుకంటే, ఆయన మన్నించేవాడూ, కరుణించేవాడూనూ".

-9:102

**(2) దేవుని శిక్ష:** ఇప్పటి వరకు మనం చర్చించుకున్న దేవుని ప్రతిచర్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని చూసినట్లైతే, అరేబియా విగ్రహారాధకులు అలాగే గ్రంథ ప్రజలు. వీరు కావాలనే ఉద్దేశ్యపూర్వకంగా సత్యాన్ని తిరస్కరించిన కారణంగా వారు మరణ శిక్షకు అర్హులే అని అర్ధమౌతుంది. కనుకనే వారికి ఒక ప్రత్యేకమైన మరణాన్ని బహూకరించాడు. ఈ ఇరువురు శత్రువులకు మరణదండన ప్రకటించినప్పటికీ, గ్రంథ ప్రజలకు ఒక విడుపును ఇవ్వడం జరిగింది. అదేమిటంటే, వారు ముస్లింలకు లొంగి ఉండాలి. కాని బహుదైవారాధకులకు మాత్రం ఈ అవకాశం

ఇవ్వబడలేదు. వారు ఇస్లాంను స్వీకరించైనా స్వీకరించాలి, లేదా మరణ శిక్షను అనుభవించాలి.

ఈ విధంగా చేయడానికి కారణం ఏమిటంటే, గతంలో మనం చర్చించుకున్నట్లు గ్రంధ ప్రజలైతే ప్రాధమికంగా ఏకేశ్వరోపాసకులు మరియు ఏకేశ్వరోపాసనను సమర్ధిస్తున్నవారే. అయితే వారు బహుదైవారాధనకు సంబంధించిన కొన్ని పనులు చేయటం అనేది వేరేవిషయం. కానీ ఈ ముష్రిక్కులు (బహుదైవా రాధకులు) మాత్రం ఈ బహుదైవారాధనను సమర్ధించేవారు మరియు దానికి ధ్వజవాహకులు కూడా కాబట్టి.

**I.విగ్రహారాధకులకు దేవుని శిక్ష:** ప్రారంభంలో ఈ బహుదైవా రాధకులకు నాలుగు నెలల గడువు ఇవ్వడం జరిగింది. దాని తరువాత వారి పతనావస్థ ప్రారంభమైపోతుంది.

“అల్లాహ్ తరఫు నుండి, ఆయన ప్రవక్త తరఫు నుండి మీరు ఒడంబడికలు చేసుకున్న ముష్రిక్కులకు (బహుదైవారాధకులకు) విముక్తి ప్రకటించబడుతోంది. కనుక మీరు దేశంలో స్వేచ్ఛగా ఇంకా నాలుగు నెలలు తిరగండి. మీరు అల్లాహ్ ను అశక్తుడుగా చెయ్యలేరని తెలుసుకోండి. అల్లాహ్ సత్యతిర - స్కారులను పరాభవంపాలు చేస్తాడు”. -9:1-2

ఏ తెగలవారైతే ప్రవక్త ముహమ్మద్ వారితో సంధి చేసుకున్నారో వారికి ఏవిధమైనటువంటి నష్టం చేకూర్చడం జరగదు. ఎప్పుడైతే సంధి కాలం ముగిసిపోతుందో అప్పుడు మాత్రం వారితో కూడా పై విధంగా చెప్పినట్లు ప్రవర్తించడం జరుగుతుంది.

“ప్రవక్తా! తిరస్కరించేవారికి కఠిన శిక్షను గురించిన శుభవార్తను వినిపించు. మీరు ఒడంబడికలు కుదుర్చుకున్న ముష్రిక్కులకు తప్ప. ఎందుకంటే వారు తమ ఒడంబడికలు నెరవేర్చడంలో

మీపట్ల ఏ లోపమూ చేయలేదు, మీకు వ్యతిరేకంగా ఎవరికీ సహాయం చేయలేదు, అటువంటివారితో పాటు మీరు కూడా ఒడంబడికలను గడువు వరకు పాటించండి. ఎందుకంటే, అల్లాహ్ భయభక్తులు గలవారంటేనే ఇష్టపడతాడు". -9:4

ఎవరైతే పెద్ద హజ్ రోజు వరకు కూడా ధర్మాన్ని స్వీకరించలేదో, ఆ బహుదైవారాధకులకు మరొకసారి అవకాశం ఇచ్చినట్లు అరాఫత్ మైదానంలో ప్రకటించడం జరిగింది. ఈ అవకాశం ముహర్రం నెల చివరి రోజు వరకు మాత్రమే ఉంటుంది. ఈలోపు వారు ధర్మాన్ని స్వీకరించాలి మరియు దానికి నిదర్శనంగా నమాజ్ చేయాలి, జకాత్ చెల్లించాలి. లేదంటే, గడువు ముగిసిన వెంటనే ఉరికంబం ఎక్కాలి.

"కనుక, నిషిద్ధ మాసాలు గడిచిపోయిన తర్వాత ముష్రిక్కులను చంపండి, ఎక్కడ కనిపిస్తే అక్కడ, ఇంకా వారిని పట్టుకోండి,

చుట్టుముట్టండి, ప్రతి మాటువద్ద వారి కొరకు పొంచి కూర్చోండి. తరువాత ఒకవేళ వారు పశ్చాత్తాపపడితే, నమాజును స్థాపిస్తే, జకాత్ ఇస్తే, వారిని విడిచి పెట్టండి. అల్లాహ్ మన్నించేవాడూ, కరుణించేవాడూనూ". -9:5

ఒకవేళ ఏ వ్యక్తి అయిన శరణు వేడుకొని ఇస్లాం ధర్మం గురించి తెలుసుకోవాలని అనుకొంటే, అప్పుడు అతనికి శరణం ప్రసాదించి, ధర్మం బోధించాలి. ఈ మధ్యలో ఏవిధమైనటువంటి ప్రతిచర్యలు చేయకూడదు. అతని గడువు ముగిసే వరకు.

"ఒకవేళ ముష్రిక్కులలో ఏ వ్యక్తి అయినా శరణుగోరి మీ వద్దకు రాదలిస్తే (అల్లాహ్ గ్రంథాన్ని వినటానికీ), అతనికి శరణు ఇవ్వండి, అతడు అల్లాహ్ గ్రంథాన్ని వినేంతవరకు. తరువాత అతనిని అతని భద్రతా స్థలం వరకు చేర్చండి. ఇలా ఎందుకు చేయాలంటే, వారికి గ్రంధ జ్ఞానం లేదు కాబట్టి". -9:6

**II.గ్రంథ ప్రజలకు దైవ శిక్ష:** ఈ క్రింది ఖురాన్ వాక్యంలో గ్రంథ ప్రజలు చేస్తున్న నేరాలను ఊటంకిస్తూ, వారికి చేసిన చివరి హెచ్చరిక.

"ఉజైర్ అల్లాహ్ కుమారుడు" అని యూదులు అంటారు. "మసీహ్ అల్లాహ్ కుమారుడు" అని క్రైస్తవులు అంటారు. వారికి పూర్వం అవిశ్వాసంలో పడివున్న వారి మాటలను అనుకరిస్తూ వారు తమ నోటితో అనే ఈ మాటలు నిరాధారమైనవి. దేవుని దెబ్బ వారిపై పడుగాక! వారెలా మోసపోతున్నారు! వారు అల్లాహ్ ను కాదని తమ పండితులను తమ సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారు. ఇంకా ఇదేవిధంగా మర్యం కుమారుడైన మసీహ్ను కూడా. వాస్తవానికి ఒకే దేవుని దాస్యం తప్ప మరెవరి దాస్యాన్నీ చేసే ఆజ్ఞ వారికి ఇవ్వబడలేదు. ఆయన తప్ప ఆరాధనకు అర్హుడైనవాడు ఎవ్వడూ లేడు. ఆయన పరిశుద్ధుడు. వారు చెప్పే షిర్క్ మాటలకు అతీతుడు". -9:30-31

వీరి తలరాతను (జాతకాన్ని) వివరిస్తూ అహ్మాద్ గామది గారు ఏమంటున్నారంటే, ఇతమామ్-అల్-హుజ్జత్ (అంటే, సత్యాన్ని ఏ ఒక్కరు కూడా తిరస్కరించడానికి ఆస్కారం లేకుండా సంపూర్ణంగా అందించి వేయడం) తరువాత మొదటిగా అణచివేయబడింది యూదులే. వారు అనేకమైన ఒప్పందాల కారణంగా క్షమాభిక్షలు పొందగలిగారు. వారిలో ఎవరైతే ఈ ఒప్పందాలను ఉల్లంఘించి దైవ ప్రవక్తను తిరస్కరించారో, వారు శిక్షింపబడ్డారు. ప్రవక్త ముహమ్మద్ వారు ఈ యూద తెగలైన బనూ ఖైనుఖాను ఖైబర్ ప్రాంతానికి, అలాగే బనూ నాదిర్ తెగను సిరియాకు వెళ్లగొట్టడం జరిగింది. ఖైబర్లో వారు సంపాదించుకున్న బలగాలను నిర్వీర్యం చేయడం జరిగింది. దీనికంటే ముందుగా అబూ రాఫీ మరియు కాఫ్ బిన్ అష్రఫ్ లను వాళ్ళ ఇళ్ళల్లోనే హతమార్చడం జరిగింది. బనూ ఖురైజా అనే తెగవారు అహ్జాబ్ సంగ్రామంలో నమ్మక ద్రోహానికి పాల్పడి నేరస్తులయ్యారు. ఎప్పుడైతే యుద్ధ

వాతావరణం తొలగిపోయి దాడి చేయవలసిన అవసరం లేకుండాపోయిందో, అప్పుడు ప్రవక్త ముహమ్మద్ వారు వీరందరినీ ముట్టడించి బందించివేశారు. ఇక ఏవిధమైనటువంటి ఆశ వారికి లేకపోయిందో అప్పుడు వారు సాఅద్ బిన్ ముఅద్ (ర.జి.)ను తమ విషయంలో తీర్పు చేయటానికి న్యాయ నిర్ణేతగా నియమించమని ప్రవక్త ముహమ్మద్ వార్ని కోరారు. వారి ఆ కోరికను ప్రవక్త వారు మన్నించారు. ఇటువంటి సందర్భంలో ఈ యూదులతో ఎలా వ్యవహరించాలి అనే విషయంలో ఎటువంటి దైవాజ్ఞ కూడా ఖురాన్లో చెప్పబడలేదు కాబట్టి, సాద్ బిన్ ము అద్ (ర.జి.)వారు ఆనాడు ఉన్న వారి తౌరాత్ గ్రంథం నుండే వారికి తీర్పును ప్రకటించారు. తౌరాత్ ప్రకారం విద్రోహానికి పాల్పడిన వారిలోని మొగవాళ్ళను సంహరించి, స్త్రీలనూ, పిల్లలనూ బానిసలుగా చేసి, వారి ఆస్తిపాస్తులను యుద్ధంలో జయించిన యుద్ధవీరులకు పంచిపెట్టెయ్యాలి. ఈ తీర్పు ప్రకారం

పురుషులందరినీ సంహరించివేయడం జరిగింది. ఖురాన్ గ్రంధం సూరే తౌబా లో ఈ యూదులకు వ్యతిరేకంగా ఇచ్చిన చివరి తీర్పు తప్ప, ఇంత దారుణమైన మరో సంఘటన ఎప్పుడూ వారి విషయంలో జరుగలేదు.

“గ్రంథ ప్రజలలో అల్లాహ్నూ, అంతిమదినాన్నీ విశ్వసించని వారునూ, అల్లాహ్, ఆయన ప్రవక్త నిషిద్ధంగా నిర్ణయించిన దానిని నిషిద్ధంగా భావించనివారునూ, ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోనివారునూ అయిన వారికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి. వారు స్వయంగా తమ చేతులతో జిజియా ఇచ్చే వరకు, లొంగి ఉండే వరకు (వారితో యుద్ధం చేయండి)” -9:29

ఈ పై ఆజ్ఞ ఇటు యూదులకూ మరియు క్రైస్తవులకూ సంబంధించినది. ఈ ఖురాన్ వాక్యాల ప్రకారం, గ్రంధ ప్రజలు

వాస్తవానికి ఏకేశ్వరోపాసనకు కట్టుబడి ఉన్నవారే. కాబట్టి వారికి విధించిన శిక్ష చాలా అల్పమైనది మరియు వారిపై దయ, జాలి చూపించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ను బాహాటంగానే తిరస్కరించిన కారణంగా వాస్తవానికి వారు మరణ శిక్షకు, సర్వనాశనానికి అర్హులైనవారే. ఐనా వారికి మరణ శిక్షనుండి తప్పించి చిన్నపాటి శిక్షనే విధించినప్పటికీ వారు దానిని సద్వినియోగం చేసుకోకుండా, ప్రవక్త ముహమ్మద్ వారు చనిపోయిన తరువాత తిరిగి విద్రోహానికి పాల్పడి తిరుగుబాటుకు ప్రయత్నించారు. అప్పుడు ఖైబర్ నుండి యూదులను, నజరాన్ నుండి క్రైస్తవులను హజ్రత్ ఉమర్ (ర.జి.) వారు మొత్తం అరేబియా ద్వీపకల్పం నుండే బహిష్కరించడం జరిగింది. ఈ దేశ బహిష్కరణ అనేది ఈ క్రింది ఖురాన్ వాక్యంలో ఇలా నెరవేరింది.

“ఒకవేళ అల్లాహ్ దేశబహిష్కార విషయాన్ని వారి నొసట వ్రాసి ఉండకపోతే, ప్రపంచంలోనే వారిని ఆయన శిక్షించి ఉండేవాడు.

పరలోకంలో వారి కొరకు నరక శిక్ష ఉండనే ఉంది. వారు అల్లహ్ను, ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించి నందువల్లనే ఇదంతా జరిగింది. అల్లాహ్ను ఎవడు తిరస్కరించినా, వాడిని అల్లాహ్ చాలా కఠినంగా శిక్షిస్తాడు". -59:3

**III.కపటులకు దైవ శిక్ష:** 9వ అధ్యాయం సూరే తౌబాలోని మూడవ భాగంలో ఈ కపట విశ్వాసులను గురించి ప్రస్తావిస్తూ, 'ఒకవేళ మీరు మీ ప్రవర్తనను మానుకోకపోతే మీరు కూడా మీ తల రాతను (అంటే, శిక్షను) ఎదుర్కోవలసి వస్తుంది' అని హెచ్చరించడం జరిగింది.

"మేము ఆ మాటను అనలేదు అని వారు మాటిమాటికీ దేవునిపై ప్రమాణం చేసి అంటారు. వాస్తవానికి వారు ఆ అవిశ్వాసపు మాటను అన్నారు. వారు ఇస్లాం ను స్వీకరించిన తరువాత అవిశ్వాసానికి ఒడిగట్టారు. వారు దేనిని చేయాలి అనుకున్నారో

దానిని చేయలేక పోయారు. అల్లాహ్, ఆయన ప్రవక్తా తమ అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేశారనే కదా వారు ఆగ్రహిస్తున్నారు. ఇక వారు తమ ఈ వైఖరిని మానుకుంటే, అది వారికే మేలు. వారు గనుక మానుకోకపోతే, అల్లాహ్ వారికి అత్యంత బాధాకరమైన శిక్ష విధిస్తాడు. ప్రపంచంలోనూ, పరలోకంలోనూ వారిని సమర్థించేవాడూ వారికి సహాయం చేసేవాడూ ఇలలో ఎవడూ లేడు". -9:74

"మీ చుట్టుప్రక్కల ఉండే ఎడారి అరబ్బులలో కపటులు చాలా మంది ఉన్నారు. అలాగే స్వయంగా మదీనా పౌరులలో కూడా కపటులు ఉన్నారు. వారు కాపట్యంలో రాటుదేలారు. మీరు వారిని ఎరుగరు. మేము వారిని ఎరుగుదుము. మేము వారికి రెట్టింపు శిక్షను విధించే సమయం సమీపంలోనే ఉంది. తరువాత వారు మరింత పెద్ద శిక్ష కొరకు తిరిగి తీసుకురాబడతారు". -9:101

గామది గారు ఈ విషయాన్ని ఇంకా రాస్తూ...

ఈ మధ్య కాలంలో మదీనాలో ప్రవక్త ముహమ్మద్ వారు తన సందేశాన్ని అరేబియాకు అవతల ఉన్న అనేక జాతులకు అందజేశారు. ఆయా జాతుల సర్దారులకు ఉత్తరాలు రాస్తూ, ఇకపై మీకు శ్రేయస్కరమైనది ఇస్లాం ధర్మం మాత్రమే అని వారికి వివరించడం జరిగింది. దీని అర్థం ఏమిటంటే, అరేబియా బహుదైవారాధకులకు అలాగే గ్రంధ ప్రజలకు ప్రవక్త ముహమ్మద్ వారు ఏవిధంగానైతే నిష్కర్షగా ఈ సందేశాన్ని తెలియపరచడం జరిగిందో, అదేవిధంగా అరేబియాకు అవతల ఉన్న ఆయా జాతులకు కూడా ఈ సందేశాన్ని నిష్కర్షగా అందించడం జరిగింది. దీని ద్వారా మనకు అర్థమౌతున్న విషయం ఏమిటంటే, ఏ విధంగానైతే ఆయా ప్రవక్తల జాతులు గతంలో ప్రవక్తలను, వారి సందేశాన్ని కావాలనే తిరస్కరించి, దేవుని ప్రతిచర్యా విధానం ప్రకారం దైవశిక్షకు బలైపోయారో, అదేవిధంగా ప్రవక్త ముహమ్మద్

వారి ఈ సందేశాన్ని తిరస్కరిస్తే వీరు కూడా అటువంటి దైవశిక్షకే బలైపోతారని అర్థమౌతుంది. తదనుగుణంగానే, ఎప్పుడైతే ప్రవక్త ముహమ్మద్ వారి శిష్యులు అరేబియా ద్వీపకల్పంలో తమ అధికారాన్ని సంపాదించుకున్నారో, అప్పుడు అరేబియాకు నలువైపుల ఉన్న ఆయా దేశాలకు రెండు విషయాలలో ఏదో ఒకదానిని ఎంపిక చేసుకునే అవకాశాన్ని ఇచ్చి, వారిపై దండయాత్రలు చేసేవారు. ఆ రెండు విషయాలు ఏమిటంటే, ఒకటి- వారు క్షేమంగా బ్రతకాలంటే ఈ సత్యాన్నైనా స్వీకరించాలి లేదా వారికి లొంగిపోయి కప్పం (జిజియా) చెల్లిస్తూ అయినా ఉండాలి. ఈ జాతులలో ఏ ఒక్క జాతికూడా బహుదైవారాధనకు ధ్వజవాహకులు కారు. లేకపోతే వారికి కూడా అరేబియా బహుదైవారాధకులకు సంభవించిన గేతే పడి ఉండిడెది.

పైన చెప్పుకున్న ఈ విషయాలను బట్టి మనకు సవివరంగా తెలుస్తున్న ఒక విషయం ఏమిటంటే, ఈ ముట్టడి సంఘటనలు, అవమానాలు కేవలం యుద్ధాలు కాదుగానీ వారికి సంబంధించిన దేవుని శిక్షలే అని చెప్పవచ్చు. సత్యతిరస్కారులు ఈ విధంగా బానిసలుగా మారిపోయే శిక్ష ఏదైతేఉందో, అది దేవుని తరుపు నుండి జరిగినది. మరియు దేవుడు ఎల్లప్పుడూ అవలంభిస్తున్న పద్ధతి కూడా ఇదే. దేవుని ప్రతిచర్యలో భాగంగా ఈ శిక్ష ప్రధమంగా అరేబియా బహుదైవారాధకులకు మరియు గ్రంథ ప్రజలకు సంభవించి, ఆ తరువాత అరేబియాకు బయట ఉన్న మరికొన్ని జాతులకు సంభవించింది. తత్ఫలితంగా వారు విశ్వాసులకు లొంగిపోయి, జిజియా చెల్లిస్తూ జీవిస్తున్నారు. అయితే, ఈ విధమైనటువంటి పద్ధతి (జిజియా కడుతూ, లొంగిపోయి ఉండే పద్ధతి) ఎల్లకాలం ఉండటానికి మాత్రం కాదు.

ఒక విధంగా చెప్పాలంటే, ప్రవక్త ముహమ్మద్ (స.అ.సం) ద్వారా దేవుడు అరేబియాలో ఏ సత్య సాక్ష్యాన్ని పలికించాడో ఆ సత్య సాక్ష్యం ఒక్కటే అరేబియా చుట్టు ప్రక్కల ఉన్న దేశాల ప్రజలకు కూడా నిష్కర్షగా సత్యాన్ని అందించడానికి సరిపోతుంది.

ఎప్పుడైతే ఈ సత్య సాక్ష్యం (షహాద) పూర్తయిందో, అలాగే మక్కా విజయం కూడా ప్రాప్తించి, దేవుని గృహమైన బైతుల్లాహ్ ఖురైషుల ఆధిపత్యం నుండి బయట పడిందో, అప్పుడు ఇస్లాం ధర్మం రాజకీయ్యంగానూ ధార్మికంగానూ అరేబియాలో ఆధిపత్యాన్ని కైవసం చేసుకుంది. ఈ మధ్యలో ఎవరికైతే ప్రవక్త ముహమ్మద్ వారు ఉత్తరాల ద్వారా సందేశం ఇచ్చారో, ఆయా రాజులు సత్య తిరస్కారానికి ఒడిగట్టారు. దానికి పర్యవసానంగా ప్రవక్త ముహమ్మద్ వారి శిష్యుల చేతులలో పరాజయం పాలై దేవుని శిక్షకు బలైపోయారు.

ఆయా దేశాల సామాన్య ప్రజలు కూడా అరేబియాలో సంభవించిన దేవుని ఈ తీర్పును కళ్ళారా వీక్షించారు. అంటే వారికి కూడా ఈ సత్యసాక్ష్యం నిష్కర్షగా, సంపూర్ణంగానే అందించబడిందనే దీని అర్థం. ఒకవేళ ఈ సామాన్య ప్రజలకు ఈ విషయంలో ఏదైనా సందేహం ఉంటే, అప్పుడు వారు తమ పాలకుల అపజయాన్ని ఆపడానికి ప్రయత్నించి ఉండేవారు. అలాగే ఈ సామాన్య ప్రజలలో కూడా ఎవరైనా సత్య విరోధులు ఉంటే, రహస్య విచారణ జరిపించి వారితో కూడా అరేబియా విగ్రహారాధకులతో ప్రవర్తించినట్లే, ప్రవర్తించి ఉండేవారు.

అయితే ఇక్కడ ఒక విషయం మాత్రం చాలా స్పష్టమైనది ఏమిటంటే, ప్రవక్త ముహమ్మద్ వారి సహచరులు చేసినటువంటి ఈ దాడులు కేవలం దేవుని ప్రతిచర్యా విధానంలోని భాగమే తప్ప, ప్రవక్త ముహమ్మద్ వారి ప్రత్యక్ష శిష్యుల అనంతరం ఈ

విధమైనటువంటి దాడులు చేసే అధికారం ముస్లింలకు ఏ మాత్రం లేదు.

## 5. దారి తప్పిన నిర్దేశనాలు:

ఇప్పటి వరకు చర్చించిన వాటిని ఆధారంగా చేసుకుని దేవుని ప్రతిచర్యా విధానానికి సంబంధించి ఇస్లాం నిర్దేశనాలు ఏమిటో చూద్దాం.

ఆ నిర్దేశనాలు ఏమిటంటే, సత్యాన్ని సంపూర్ణంగా గ్రహించి, కావాలనే తిరస్కరించినటువంటి ప్రవక్త ముహమ్మద్ వారి ప్రత్యక్ష సంబోధితులకు సంబంధించినవి మాత్రమే గాని, మరో ముస్లిమేతర సమూహానికి సంబంధించినవి మాత్రం కావు. ఆ నిర్దేశనాలు ఏమిటంటే, కావాలని సత్యాన్ని తిరస్కరించిన

కారణంగా అవమానాలకు గురిచేయడం, బానిసలుగా మార్చి లొంగి ఉండేలా చేయడం అనే మొదలైన రకాల శిక్షలను విధించడం. ఈ నిర్దేశనాలు ఆ ముస్లిమేతరుల విషయంలో మాత్రం కాదు, ఎవరైతే సత్యాన్ని సంపూర్ణంగా తెలుసుకోలేదో. అయితే వారు సత్యాన్ని  సంపూర్ణంగా తెలుసుకున్నారో లేదో అనే విషయం మానవ మాత్రులమైన మనం మాత్రం నిర్ణయించలేము. అది దేవుడే నిర్ణయించవలసిన విషయం.  ప్రవక్తల కాలంలో దేవుడు ఈ విషయాన్ని ఆయా ప్రవక్తలకు తన దివ్యావిష్కృతి (వహీ) ద్వారా తెలియపరిచేవాడు. ఈ ప్రవక్తల ఆగమనం ఆగిపోయిన తరువాత దేవుడు ఏ వ్యక్తికి కూడా తన సందేశాన్ని పంపడు కాబట్టి, మనం ఎవరి విషయంలో కూడా ఈ తీర్పును చేయలేము. ఒకవేళ ఏ వ్యక్తి అయిన సరే బాహాటంగా ఈ సత్య ధర్మాన్ని తిరస్కరించినప్పటికీ. కాబట్టి ఈ నిర్దేశనాలు ఈనాటి ముస్లిమేతరులకు సంబంధించినవి మాత్రం కావు.

(అపార్థానికి గుర్తైన) ఈ క్రింది చెప్పబడిన కొన్ని నిర్దేశనాలు:

I.ధర్మ భ్రష్టునికి విధించే శిక్ష. II.ముస్లిమేతరులకు వ్యతిరేకంగా యుద్ధం చేయుట. III.జిమ్మీలుగా ముస్లిమేతర అల్పసంఖ్యాకుల స్థానం. iv.ముస్లిమేతరులతో స్నేహం నిషేధం. v.ముస్లిం రక్తం యొక్క ఔన్నత్యం. vi.ముస్లిమేతరులను తక్కువ భావంతో పలకరించడం. VII.ముస్లిమేతరులు పరలోకంలో శిక్షింపబడతారని భావించడం. VIII.ముస్లిమేతరులను హతమార్చడం. IX.ముస్లిమేతరులను క్షమించమని దేవుడిని ప్రార్థించడం నిషేదం. X.ముస్లిం-ముస్లిమేతరుల మధ్య వారసత్వం అనేది నిషిద్ధం. XI.ముస్లిమేతరుల సాక్ష్యం నిషిద్ధం. XII.ముస్లిమేతరులను అనుకరించడం నిషిద్ధం. XIII.ఇస్లాం ఆధిపత్యం కోసం పాటుపడటం.

చాలామంది ముస్లిం పండితులలో ఉన్న ఈ కొన్ని తప్పుడు అభిప్రాయాలు. వీటిని మనం ఒకొక్కటిగా పరిశీలిద్దాం.

***I.ధర్మ భ్రష్టునికి విధించే శిక్ష:*** దాదాపు అన్ని ముస్లిం వర్గాల పండితుల ప్రకారం ఎవరైతే ఇస్లాం ధర్మం నుండి వైదొలగిపోతారో వారు మరణ శిక్షకు అర్హులు అని అంటారు. వారు తమ ఈ వాదనకు ఈ క్రింది హదీసును ఉదహరిస్తారు. ఈ హదీసును అబ్దుల్లా ఇబ్నె అబ్బాస్ వారు ఉల్లేఖించారు.

"ఎవరైతే తమ విశ్వాసాన్ని మార్చుకున్నారో వారిని హతమార్చండి" అని ప్రవక్త ముహమ్మద్ (స.అ.సం) వారు అన్నారు. (అల్ బుఖారి, అల్జామి, అల్సహీ.వాల్యూమ్ 3 1098 (నెం:2854)

ఈ పండితులు ప్రవక్త ముహమ్మద్ వారు చెప్పినటువంటి ఈ ఆదేశం ప్రళయం వరకూ ప్రతీ ముస్లిం వ్యక్తికి సంబంధించినది అని అంటారు.

ఎప్పుడైతే అరేబియా బహుదైవారాధకులు ఉద్దేశపూర్వకంగానే ఈ సత్యాన్ని తిరస్కరించిన కారణంగా మరణ శిక్షకు గురయ్యారో అనే విషయం మనం గత పంక్తులలో చర్చించుకున్నాం.

“కనుక, నిషిద్ధ మాసాలు గడిచిపోయిన తర్వాత ముష్రిక్కులను చంపండి, ఎక్కడ కనిపిస్తే అక్కడ, ఇంకా వారిని పట్టుకోండి, చుట్టుముట్టండి, ప్రతి మాటువద్ద వారి కొరకు పొంచి కూర్చోండి తరువాత ఒకవేళ వారు పశ్చాత్తాపపడితే, నమాజును స్థాపిస్తే, జకాత్ ఇస్తే, వారిని విడిచిపెట్టండి. అల్లాహ్ మన్నించేవాడూ, కరుణించేవాడూను” -9:5

పైన ఉదహరించిన హదీసు కేవలం ప్రవక్త ముహమ్మద్ వారి కాలంలో ఉన్న అరేబియా బహుదైవారాధకులకు సంబంధించినది మాత్రమే. ఎందుకంటే, 9:5లో ఉన్న ఆజ్ఞలు కేవలం ఆనాటి ప్రవక్త యొక్క ప్రత్యక్ష సంబోధితులైన అరేబియా బహుదైవారాధకులకు మాత్రమే గనుక. ఈ ఆజ్ఞ ఏమాత్రం ఇతర వ్యక్తులకు గాని, ఇతర జాతులకు గాని వర్తించదు. అంతే కాదు ప్రవక్త ముహమ్మద్ వారి కాలంలో ఉన్న గ్రంథ ప్రజలకు కూడా వర్తించదు. వీటికి కారణాలు ఏమిటో గత పంక్తులలో మీరు తెలుసుకున్నారు. ఖురాన్లో ఉన్న ఈ చట్టం ఆనాటి బహుదైవారాధకులకు మాత్రమే. వారు ధర్మాన్నైనా స్వీకరించాలి, లేదా మరణ శిక్షనైనా అనుభవించాలి. దీనిని బట్టి అర్థమైన విషయం ఏమిటంటే, ఆనాటి బహుదైవారాధకులలోని వాడు మరణ శిక్షకు భయపడి లేక ఏ కారణం చేతనైనా ఇస్లాం ధర్మం

స్వీకరించి, తిరిగి మరలా తన పాత బహుదైవారాధనకు మరలిపోతే అప్పుడు మాత్రమే ఈ మరణ శిక్ష విధించాలి అని అర్ధమౌతుంది. ఈ క్రింది హదీసు కూడా అటువంటి అర్ధాన్నే ఇస్తుంది. *(ఎందుకంటే, అసలు వాడు మరణ శిక్షకే అర్హుడు, అయినప్పటికీ ఈ సత్యాన్ని స్వీకరిస్తే నిన్ను విడిచిపెడతాము అనే ఒక నెపంతో వాడికి ప్రాణభిక్ష పెట్టడం జరిగింది. అయితే దానిని సద్వినియోగం చేసుకోకుండా, పిచ్చివేషాలు వేసి ధర్మం నుండి తప్పిపోతే మరి అటువంటి వాడికి మరణ శిక్ష కాకపోతే, ఏ శిక్ష విధించాలి?)* **ఇది అనువాదకుని వ్యాఖ్యానం.**

అబ్దుల్లా ఇబ్నె ఉమర్, తనకు ప్రవక్త ముహమ్మద్ వారు ఆజ్ఞాపించినట్లు చెబుతూ...

"నీవు వీరితో యుద్ధం చేస్తూనే ఉండు. ఒకవేళ వారు దేవుడు ఒక్కడే అని, ముహమ్మద్ దేవుని ప్రవక్త అని సాక్ష్యం ఇస్తూ,

నమాజ్ చేస్తూ, జకాత్ ఇస్తూ, ఉంటే తప్ప. అప్పుడు వారికి అభయం ఇవ్వడం జరుగుతుంది. ఒకవేళ వారు ఏదైనా మరొక నేరం చేస్తే అప్పుడు ఇస్లాం చట్టం ప్రకారం శిక్షింపబడతారు. అలాగే పరలోకంలో దేవుని చేత కూడా శిక్షింపబడతారు" –ముస్లిం, అల్ జామి, అల్ సహీ. వొల్యూమ్ 1,53 (నెం:22) హదీసు యొక్క మూలంలో (అల్-నాస్) (ఈ ప్రజలు) అని ఉంది. అంటే ఈ అరేబియా విగ్రహారాధకులు అని అర్ధం.

అనస్ ఇబ్నె మాలిక్, తనకు ప్రవక్త ముహమ్మద్ వారు ఆజ్ఞాపించినట్లు చెబుతూ...

"నీవు ఈ బహుదైవారాధకులతో యుద్ధం చేస్తూనే ఉండు. ఒకవేళ వారు దేవుడు ఒక్కడే అని, ముహమ్మద్ దేవుని ప్రవక్త అని సాక్ష్యం ఇస్తూ, నమాజ్ చేస్తూ, జకాత్ ఇస్తూ మరియు మన ఖిబ్లాను స్వీకరించి, మేము జిబాహ్ చేసిన జంతుమాంసాన్ని

తింటే, అప్పుడు వారి ధన-ప్రాణాలను పవిత్రంగా చూసుకోవాలని. ఒకవేళ వారు మరో ఇతర నేరాలకు పాల్పడితే తప్ప".

జకాత్ చెల్లించని వారిపై మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (ర.జి) వారు తన కాలంలో నిర్వహించిన ఈ దాడులను కూడా ఈ కోణంలోనే చూడాలి. అలాగే ఇస్లాం ప్రకారం ఎవరైతే జకాత్ చెల్లించరో వారు ఇక ముస్లింగా పరిగణింపబడరు. ఇక ఎవరైతే నయాన భయాన ఇస్లాం స్వీకరించి ముస్లింగా మారిపోయారో, వారు గనుక జకాత్ చెల్లించకపోతే తిరిగి వారు తమ పాత ధర్మమైన బహుదైవారాధన వైపునకు మరలిపోయినట్లే. అటువంటి వారికి తిరిగి మరణ శిక్ష విధించవలసినదే. ఒకవేళ వారు మరలా ధర్మాన్ని స్వీకరిస్తే తప్ప. అబూబకర్ వారు ఇటువంటి ధర్మ భ్రష్టులపైనే తన శిక్షను విధించేవారు.

ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని చూసినట్లైతే, ఈ మరణ శిక్ష అనేది కేవలం ప్రవక్త వారి కాలంలో ఉన్న అరేబియా బహుదైవారాధకులకు మాత్రమే తప్ప ఏ ఇతర వ్యక్తులకు గాని, ఏ ఇతర జాతులకు గాని వర్తించదు.

***II.ముస్లిమేతరులకు వ్యతిరేకంగా యుద్ధం చేయడం:***

ముస్లిం ధార్మిక పండితుల యొక్క దృష్టిలో- "ముస్లింలు బహుదైవారాధకుల జాతులతోనూ, యూదులతోనూ, క్రైస్తవులతోనూ యుద్ధం చేస్తూనే ఉండాలి. వారు తమకు లొంగిపోయే వరకు" అని భావిస్తుంటారు. అలాగే బహుదైవారాధకులు గనుక ఇస్లాం స్వీకరిస్తే తప్ప వారిని విడిచిపెట్టకూడదు అని, యూదులు, క్రైస్తవులు జిజియా చెల్లించి వారికి లొంగి ఉంటే, తమ తమ మాతాలను ఆచరించుకోవచ్చు.

అని భావిస్తూ ఉంటారు. వారి ఈ భావాలను సమర్ధించుకోవటానికి ఈ క్రింది ఖురాన్ వాక్యాలను చూపిస్తారు.

“కనుక, నిషిద్ధ మాసాలు గడిచిపోయిన తర్వాత ముష్రిక్కులను చంపండి, ఎక్కడ కనిపిస్తే అక్కడ, ఇంకా వారిని పట్టుకోండి, చుట్టుముట్టండి, ప్రతి మాటువద్ద వారి కొరకు పొంచి కూర్చోండి. తరువాత ఒకవేళ వారు పాశ్చాత్తాపపడితే, నమాజును స్థాపిస్తే, జకాత్ ఇస్తే, వారిని విడిచిపెట్టండి. అల్లాహ్ మన్నించేవాడూ, కరుణించేవాడూనూ”. -9:5

“గ్రంథ ప్రజలలో అల్లాహ్నూ, అంతిమదినాన్నీ విశ్వసించని వారునూ, అల్లాహ్, ఆయన ప్రవక్త నిషిద్ధంగా నిర్ణయించిన దానిని నిషిద్ధంగా భావించని వారునూ, ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోని వారునూ అయిన వారికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి. వారు స్వయంగా తమ చేతులతో జిజియా ఇచ్చేవరకూ, లోబడి ఉండేవరకూ (వారితో పోరాడండి)”. -9:29

గతంలో మనం చర్చించుకున్న దాని ప్రకారం ఇలాంటి ఖురాన్ వాక్యాలు కేవలం ప్రవక్త ముహమ్మద్ వారు జీవించి ఉండీ, ప్రవక్త వారి ప్రత్యక్ష సంబోధితులైన బహుదైవారాధకులకు, యూదులకు, క్రైస్తవులకు సంబంధించినవే అనే విషయం తెలిసిందే. ఇటువంటి ఖురాన్ వాక్యాల అర్ధం ఏమిటంటే, ఆయా ప్రవక్తల ప్రత్యక్ష సంబోధితులకు సంబంధించినవి మాత్రమే. అవిశ్వాసులపై దాడులు చేయడమనేది ఒక ప్రత్యేకమైన పరిస్థితులలో తప్ప వాటిని ప్రవక్తల తరువాత వచ్చిన వారి విషయంలో మాత్రం కాదు.

కాబట్టి ఇస్లాం ఖడ్గంతో వ్యాపించిందనే పాత రోదన ఏదైతే ఉందో, దానిని ఈ కోణంలో చూస్తే అర్ధమైపోతుంది. ప్రవక్త ముహమ్మద్ వారి శిష్యులు చేసిన యుద్ధాలు కేవలం ప్రవక్త ముహమ్మద్ వారు అసంపూర్ణంగా విడిచిపెట్టిన మిషన్లోని భాగం మాత్రమే. వారు

ఇస్లాంను వ్యాపింపచేయలేదు. కేవలం సత్యాన్ని కావాలనే తిరస్కరించిన వారిని శిక్షించడం మాత్రమే చేశారు. అయితే వారి తరువాత ఏ ఒక్క ముస్లిం కూడా ఏ వ్యక్తి పైన లేక ఏ జాతి పైన ఇస్లాం పేరుతో లొంగదీసుకోవడం గాని, వారిపై జిజియా విధించడం గాని చేసే అధికారం కలిగిలేరు.

***III.జిమ్మీలుగా ముస్లిమేతర అల్పసంఖ్యాకుల స్థానం:***

ముస్లిం పండితుల ప్రకారం ఒక ఇస్లామీయ రాజ్యంలో ముస్లిమేతరుల పౌరసత్వం రెండు విధాలుగా ఉంటుంది అనేది.

**1.జిమ్మీలు:** యుద్ధలో లొంగిపోయి ఇస్లామీ రాజ్య చట్టం ప్రకారం జీవిస్తున్న వాళ్ళు.

**2.ముస్తమీన్స్:** ఇస్లామీయ రాజ్యంతో ఒప్పందం చేసుకుని ఉంటున్న తాత్కాలిక ముస్లిమేతరులు.

గత పంక్తులలో మనం చర్చించుకున్నట్లు అవిశ్వాసులను సత్యాన్ని ఒప్పుకోమని బలవంతం చేయడంగాని, లేదా దానిని తిరస్కరిస్తే మరణ శిక్ష విధించడంగాని కేవలం ప్రవక్తలు నిర్వర్తించవలసిన పనులే తప్ప, వారి తరువాత వారిని అనుసరించిన అనుచరులకు మాత్రం ఈ విధానం చెల్లదు. ప్రవక్తలు చేసింది కూడా దేవుని ప్రతిచర్యా విధానంలోని భాగంగానే. ఈనాటి ముస్లిమేతరులకు మాత్రం ఈ విధానం ఏ విధంగానూ చెల్లదు.

ప్రస్తుతం ఇస్లామీ రాజ్యంలో ఉంటున్న ముస్లిమేతరులను ఒప్పందం చేసుకున్న పౌరులుగా వర్గీకరించాలి. ఏదైనా ఒక రాజ్యం యొక్క శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని పరస్పర అవగాహనతో ఏవిధమైనటువంటి ఒప్పందాన్నైనా ఈనాటి ముస్లిమేతరులతో వారి సంక్షేమం కోసం చేసుకోవచ్చు. పరస్పర

ఒప్పందం చేసుకున్న దాని ప్రకారంగానే వారితో అన్ని వ్యవహారాలు నడపాలి.

### *IV. ముస్లిమేతరులతో స్నేహం నిషేధం:*

ఈ క్రింది ఖురాన్ వాక్యాన్ని దృష్టిలో పెట్టుకొని కొందరు ముస్లిం పండితులు ముస్లిమేతరులను స్నేహితులుగా చేసుకోకూడదని, వారితో శత్రుత్వంతో ఉండాలని భావిస్తారు.

"విశ్వాసులు తోటి విశ్వాసులను కాదని అవిశ్వాసులను తమ మిత్రులుగా, తమ సహచరులుగా, తమ సహాయకులుగా ఎంతమాత్రం ఎన్నుకోరాదు. అలా చేసేవారికి అల్లాహ్ తో ఏవిధమైన సంబంధమూ లేదు. అయితే వారి దౌర్జన్యం నుండి రక్షణ పొందటానికి మీరు ఆ వైఖరిని అవలంభిస్తే అది క్షమార్హమే. కానీ అల్లాహ్ తనకే భయపడమని హెచ్చరిస్తున్నాడు. మీరంతా ఆయన వద్దకే మరలిపోవలసి ఉంది". -3:28

“విశ్వసించిన ఓ ప్రజలారా! విశ్వాసులను కాదని అవిశ్వాసులను మీ మిత్రులుగా చేసుకోకండి. మీరు, మీకే వ్యతిరేకంగా అల్లాహ్కు స్పష్టమైన సాక్ష్యం ఇవ్వదలచుకున్నారా?” -4:144

“విశ్వాసులారా! యూదులనూ, క్రైస్తవులనూ మీ మిత్రులుగా చేసుకోకండి. వారు తమలో తామే ఒకరికొకరు మిత్రులు. ఎవడైనా వారిని తన మిత్రులుగా స్వీకరిస్తే, అతడు కూడా వారిలో ఒకడుగా పరిగణింపబడతాడు. నిశ్చయంగా అల్లాహ్ దుర్మార్గులకు తన మార్గదర్శకత్వానికి దూరం చేస్తాడు”. -5:51

ఈ ఖురాన్ వాక్యాలను మనం జాగ్రత్తగా పరిశీలించినట్లైతే కొన్ని యదార్థాలు మనకు కనిపిస్తాయి. అవి ఏమిటంటే, ఈ వాక్యాలు మదీనాలో అవతరించాయి. మదీనా జీవితం యొక్క దృశ్యాన్ని మనం దృష్టిలో ఉంచుకోవాలి. మదీనా నుండి తన ప్రతిచర్యా విధానాన్ని అమలు పరచాలన్నది దేవుని ప్రణాళిక. ఆ

సందర్భంలో అవిశ్వాసులను అంతమొందించాలి గనుక వారితో విశ్వాసులు కలసిమెలసి, స్నేహంగ తిరగకూడదు. ఎందుకంటే, కొన్ని సందర్భాలలో వీరి రహస్యాలు వారికి చేరిపోయే ప్రమాదం ఉంది కాబట్టి. అలాగే శిక్షకు గురైనవారితో కలిసి తిరిగి మీరు కూడా శిక్షకు గురైపోయే ప్రమాదం ఉంది కాబట్టి. అలాగే ఈ వాక్యల్లో చాలా స్పష్టంగా ఈ బహుదైవారాధకులు, ఈ యూదులు, ఈ క్రైస్తవులు అని చెప్పడంలో గల ఆంతర్యం ఏమిటంటే, ప్రవక్త వారి ప్రత్యక్ష సంబోధితులైన బహుదైవారాధకులు, యూదులు, క్రైస్తవులు అని మాత్రమే తప్ప, ఆ తరువాతి ముస్లిమేతరులకు సంబంధించినవి మాత్రం కావు అని గ్రహించాలి.

***V. ముస్లిం రక్తం యొక్క ఔన్నత్యం:***

“ఒక ముస్లిం గనుక ఒక ముస్లిమేతరుణ్ణి చంపినట్లైతే, ఈ ముస్లిం నేరస్తుణ్ణి చంపకూడదు. ఒకవేళ ఒక ముస్లిమేతరుడు గనుక ఒక ముస్లింని చంపినట్లైతే, అప్పుడు ఆ ముస్లిమేతర నేరస్తుడిని చంపివేయాలి” అనేది ముస్లిం పండితుల అభిప్రాయం. దానికి వారు ఈ క్రింది హదీసును చూపిస్తారు.

“ఏ విశ్వాసి కూడా ఒక అవిశ్వాసిని చంపిన కారణంగా (రక్త పరిహారంలో భాగంగా) చంపబడకూడదు” అని ప్రవక్త ముహమ్మద్ వారు చెప్పారు అని ఇబ్నె అమ్ర్ బిన్ అల్ ఆస్ చెప్పినట్లు అతని కుమారుడు షుఐబ్ ఇబ్నె ముహమ్మద్ చెప్పారు.

ఇక్కడ హజ్రత్ అలీ వారికి ఆపాదించబడిన మరో కథనం ఏమిటంటే, “అవిశ్వాసి అనే పదం విగ్రహారాధకుడు” అనే అర్థంలో చెప్పబడింది. ఏ ముస్లిం కూడా ఒక విగ్రహారాధకుడి రక్త

పరిహారంలో భాగంగా చంపబడకూడదు" ఈ హదీసు కూడా స్వతహాగా ఒక నిర్దేశనాన్ని ఇవ్వజాలదు. అది ఖురాన్ ప్రబోధనకు అనుగుణమైనదై ఉండాలి అనేది ప్రామాణికం. కాబట్టి, గతంలో మనం చర్చించుకున్నట్లు ఖురాన్లో చెప్పబడిన దేవుని ప్రతిచర్యా విధానంలో భాగమే ఈ హదీసు. ప్రవక్త ముహమ్మద్ వారు మదీనా పట్టణానికి వలసపోయిన తరువాత ఈ విగ్రహారాధకులు తాము జీవించి ఉండే అధికారాన్ని కోల్పోయారు. ఎందుకంటే వారు కావాలనే సత్యాన్ని తిరస్కరించారు. కాబట్టి ఈ విధమైన హదీసులు కేవలం ప్రవక్త ముహమ్మద్ వారి కాలంలో ఉన్న ప్రత్యక్ష సంబోధితులైన బహుదైవారాధకులకు మాత్రమే చెందుతుంది. అంతే తప్ప ఈనాటి ముస్లిమేతరులకు మాత్రం చెందదు. కాబట్టి ఈనాడు ఎవరైనా ఒక ముస్లిం ఒక ముస్లిమేతరుని హత్యలో నేరస్తుడైతే, అతడు తప్పకుండా

ఉరికంభం ఎక్కవలసిందే. ఒకవేళ ఆ హతుని వారసులు క్షమాభిక్ష ప్రసాదిస్తే తప్ప.

***VI. ముస్లిమేతరులను తక్కువ భావంతో పలకరించాలి:***

చాలామంది ముస్లింల భావం ఏమిటంటే, ఒక ముస్లిం ఒక ముస్లిమేతరునుకి మొదటిగా సలాం చేయకూడదు. (అంటే మొదటిగా పలకరించకూడదు) అని. ఎందుకంటే, అలాచేస్తే వారిని గౌరవించినట్లు అవుతుంది అని. ఈ విధంగా భావించడానికి కారణం ఈ క్రింది హదీసులను చూపడం జరుగుతుంది.

ప్రవక్త ముహమ్మద్ వారు చెప్పినట్లు అబూ హురైర ఈ విధంగా చెప్పారు – "యూదులను గాని, క్రైస్తవులను గాని మొదటిగా సలాం చేయకండి" ఒకవేళ ఈ హదీసును, గతంలో మనం

చర్చించుకున్న దేవుని ప్రతిచర్యా విధానాన్ని దృష్టిలో పెట్టుకొని చూసినట్లైతే, ఈ హదీసు కేవలం ప్రవక్తవారి కాలంలో ఉండి, సత్యాన్ని కావాలనే తిరస్కరించిన యూదులూ, క్రైస్తవుల విషయంలోనే తప్ప, ఇతర ముస్లిమేతరుల విషయంలో మాత్రం కాదు అని అర్ధమౌతుంది.

ప్రవక్త ముహమ్మద్ వారి కాలంలో కూడా సత్యాన్ని తిరస్కరించడానికి పూర్వం (అంటే, వారు ఇంకా సత్యతిరస్కరులుగా మారక పూర్వం) ముస్లిమేతరులు కూడా ప్రవక్త వారిని ప్రధమంగా సలాం చేసేవారు, అలాగే ప్రవక్త ముహమ్మద్ వారు కూడా వారికి అదేవిధంగా సలాం చేసేవారు.

ఉసామా ఇబ్నె జైద్ తనతో ఈ విధంగా చెప్పినట్లు ఉర్వహ్ తెలియజేస్తున్నారు. ఒకసారి ముహమ్మద్ వారు వెళ్తూ ఉండగా అక్కడ కొందరు ముస్లింలు, యూదులు కలసి ఉండగా వారిని

ఉద్దేశించి, “అస్సలాము అలైకుమ్” అని చెప్పారు. - అబుఈసా ముహమ్మద్ ఇబ్నెఈసా అల్ తిర్మిజీ, సునన్ వాల్యూమ్ 15. (బీరుట్ డేరిహ్యా అల్ తురాత్ అల్ అరబీ nd, 61, (నెం:2702)

### *VII. ముస్లిమేతరులు పరలోకంలో శిక్షింపబడతారు:*

సాధారణంగా ప్రతి ముస్లిం కూడా ముస్లిమేతరులు నరకానికి బలైపోతారు అని భావిస్తారు. దానికి ఆధారంగా ఈ ఖురాన్ వాక్యాన్ని చూపిస్తారు.

“గ్రంథ ప్రజలలో, బహుదైవారాధకులలో సత్యాన్ని తిరస్కరించిన వారు తప్పనిసరిగా నరకాగ్నిలోకే పోతారు, అందులోనే వారు శాశ్వతంగా ఉండిపోతారు. వారు సృష్టిలోకెల్లా పరమ నీచులు”.

-98:6

మనం మరోసారి ఆనందించదగ్గ విషయం ఏమిటంటే, ఈ వాక్యాలు కూడా ప్రవక్త ముహమ్మద్ వారి కాలంలో ఉన్న ప్రత్యక్ష సంబోధితులైన యూద, క్రైస్తవ, విగ్రహారాధకులకు సంబంధించినవే. ఎందుకంటే వారు కావాలనే సత్యాన్ని తిరస్కరించారు. ఇప్పటివరకు చర్చించిన దేవుని ప్రతిచర్యా విధానాన్నిబట్టి ఈ విధమైనటువంటి ముస్లిమేతరులు వారి తలరాతను ఖచ్చితంగా అనుభవిస్తారు. అయితే, ఇప్పటి ముస్లిమేతరులు నిజాయితీగా సత్యాన్ని అన్వేషించకుండా ఒకవేళ వారికి ఈ సత్యాన్ని తెలియపరచినప్పటికీ, కావాలనే తిరస్కరిస్తే అప్పుడు వారు పరలోకంలో శిక్షింపబడతారు.

## *VIII. ముస్లిమేతరులను హతమార్చాలి:*

అనేకమైన చర్చలలో భాగంగా మనం దైవదూషణ చేసినవారికి మరణ శిక్షను గురించి చర్చించుకుంటూ, ఈ విధమైనటువంటి

మరణ శిక్ష కేవలం ప్రవక్త ముహమ్మద్ వారి కాలంలో ఉండే అతని ప్రత్యక్ష సంబోధితుల కొరకే అనే విషయం తెలుసుకున్నాం. దానికి ఉదాహరణగా అబూ రాఫి, కాఫ్ ఇబ్నె అష్రఫ్. ఈ ఇద్దరూ తమ నేరం వలన వారి వారి ఇళ్ళల్లోనే చంపబడ్డారు.

సత్యాన్ని కావాలనే తిరస్కరించినవారు దైవ ప్రతిచర్యా విధానాన్ని అనుసరించి మరణ శిక్షకు అర్హులు అనే విషయం గత పంక్తులలో మనం తెలుసుకున్నాం. అయితే వారిలో చాలమందికి పునరాలోచించుకోవడానికి కొంత సమయం ఇవ్వబడింది. అయినప్పటికీ వారు సమాజంలో కలహాలను రేకెత్తిస్తూ అలజడి వాతావరణాన్ని సృష్టిస్తూ, అల్లకల్లోలాలు చేస్తూ ఉండేవారు. చివరికి వారి ఈ అహంభావానికి గాను వారిని హతమార్చడం జరిగింది. ప్రవక్తకు మరియు ధర్మానికి అతి దారుణమైన నష్టాన్ని కలిగించిన ముగ్గురు వ్యక్తులను గురించి జావేద్ అహ్మద్ గామది గారు వివరిస్తూ....

గజ్వయే ఖన్దఖ్ (కందకాల యుద్ధం) లో మదీనాకు వ్యతిరేకంగా అనేక తెగలవారిని సమీకరించిన నేరానికి పాల్పడిన వారిలో అబూ రాఫే అనేవాడు ఒకడు. ఇబ్నె ఇస్హాఖ్ వారి మాటల్లో... కాఫ్ ఇబ్నె అష్రఫ్ గురించి చరిత్ర కారులు రాస్తూ... బద్ర్ యుద్ధం తరువాత ఇతడు మక్కాకు వెళ్ళిపోయి  అక్కడ కొన్ని పద్యాలు, పాటల వంటి వాటిని ఖురైషులకు వినిపిస్తూ ప్రతీకారం తీర్చుకొండని ప్రోత్సహించేవాడు. అలాగే కొన్ని రచనలు ముస్లింలకు వ్యతిరేకంగా రాస్తూ, కొంతమంది ముస్లిం మహిళల పేర్లు ప్రస్తావిస్తూ కించపరిచేవాడు. ఇంకా ప్రవక్త ముహమ్మద్ వారి ఆధ్వర్యంలో ఉంటున్న వారికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టేవాడు. వాడి చర్యలను తెలియపరుస్తూ, వాడు ప్రవక్త ముహమ్మద్ వారిని మోసపూరితంగా హత్య చేయడానికి కూడా కుట్రలు పన్నాడు. అబ్దుల్లా ఇబ్నె ఖతాల్ను జకాత్ వసూలు చేసుకొని రమ్మని ప్రవక్త వారు పంపిస్తూ అన్సార్ తెగకు చెందిన

ఒక బానిసను తోడుగా ఇచ్చారు. అయితే ఇబ్నె ఖతాల్ ఆ బానిసను తనకు అవిధేయత చూపాడనే నెపంతో చంపివేసి మాక్కాకు పారిపోయాడు. చివరికి ధర్మ భ్రష్టత్వానికి పాల్పడ్డాడు. ఇంతేకాదు మనం ప్రస్తావించుకున్న ఈ ముగ్గురు కూడా ప్రవక్త వారిని, ఆయన తెచ్చిన సందేశాన్ని తిరస్కరించడంలో రాటుదేలిపోయారు. సత్యం వారికి ఎంతో విస్పష్టంగా విశదమైనప్పటికీ.

### *IX. ముస్లిమేతరులను క్షమించమని దైవాన్ని ప్రార్థించడం నిషేధం:*

సర్వసాధారణంగా ముస్లింలలో ఒక అపోహ ఉంది. అదేమిటంటే, ముస్లిమేతరులను క్షమించమని దేవుడిని ప్రార్థించకూడదు అనేది. దానికి ఈ క్రింది ఖురాన్ వాక్యాన్ని చూపిస్తారు.

"ముష్రిక్కులను క్షమించవలసినదిగా ప్రార్థన చెయ్యటం ప్రవక్తకూ, విశ్వాసులకూ తగనిపని, వారు వారికి బంధువులైనప్పటికీ, ఇంకా వారు నరకానికి అర్హులని వారికి స్పష్టమైనప్పుడు". -9:113

ఇక్కడ మనం మరోసారి ఆనందించదగ్గ విషయం ఏమిటంటే, ఈ వాక్యంలో కూడా చాలా స్పష్టంగా ఏముందంటే, వారు అల్లాహ్ చేత నరక వాసులుగా నిర్ణయించబడినవారే. ఎందుకంటే వారికి సత్యం సంపూర్ణంగా అందించబడినప్పటికీ వారు తిరస్కార శిఖరాలకు చేరిపోయారు. ఇటువంటివారి విషయంలోనే ప్రవక్త ముహమ్మద్ వారు మరియు అతని శిష్యులు కూడా క్షమించమని ప్రార్థన చేసేవిషయంలో నిరోధించబడ్డారు. ఇది దేవుని ప్రతిచర్యా విధానంలోని ఒక భాగమే. కాబట్టి ఈ ఖురాన్ వాక్యం ప్రవక్త ముహమ్మద్ మరియు అతని అనుయాయుల

తరువాత వచ్చిన ముస్లిమేతరుల గురించి మాత్రం కాదు అని మనకు అర్థమౌతుంది.

***X.ముస్లింలు-ముస్లిమేతరుల మధ్య వారసత్వ సంబంధం ఉండదు:***

ఈ క్రింది హదీసును అనుసరించి, ఒక ముస్లింకు మరో ముస్లిమేతరునితో వారసత్వ సంబంధం ఉండదని ముస్లిం పండితులు భావిస్తుంటారు. ప్రవక్త ముహమ్మద్ వారు చెప్పినట్లు ఉస్మాన్ ఇబ్నె జైద్ ఉల్లేఖించారు. "ఒక ముస్లిం వ్యక్తి ఒక ముస్లిమేతర వ్యక్తికి వారసుడు కాలేడు. అలాగే ఒక ముస్లిమేతరుడు ఒక ముస్లిం వ్యక్తికి వారసుడు కాలేడు" –అల్ బుఖారి, అల్ జామి, అల్ సహీహ్ వాల్యూమ్-6. 2484 (నెం:6383)

ఈ మధ్య కాలంలో చాలామంది ఇస్లాం ధర్మం స్వీకరించి ముస్లింలుగా మారుతున్న కారణంగా వారి కుటుంబాలలో చీలికలు ఏర్పడుతున్నాయి. ఒకవేళ మనం ఈ హదీసును గనుక

ఇప్పటివరకు మనం చర్చించుకున్న ఆ దేవుని ప్రతిచర్యా విధానానికి అనుసంధానం చేసి చూసినట్లైతే అప్పుడు మనకు చాలా స్పష్టంగా తెలిసే విషయం ఏమిటంటే, ఈ హదీసు కేవలం ప్రవక్తవారి కాలంలో ఉండి, ఆయనగారి ప్రత్యక్ష సంబోధితులైన బహుదైవారాధకులకు మాత్రమే సంబంధించినదని అర్ధమౌతుంది. ఎందుకంటే, వాక్యంలో అల్ కాఫీరూన్ అని ఉంది. అంటే ఈ అవిశ్వాసులు అని అర్ధం. ఒకసారి మనం ఖురాన్ 4:12 చూసినట్లైతే, బంధుత్వ సంబంధాల ప్రాధాన్యతను తెలియపరుస్తున్నాడు. ఒకవేళ ఈ బంధుత్వాలను మనం ఒక ప్రత్యేకమైన ప్రాతిపదిక మీద (ధర్మా ధర్మాల మీద) విడదీసినట్లైతే అప్పుడు వారసత్వ సంబంధాలు వారి మధ్యనే తెగిపోతాయి. ఖురైషులు, మరియు గ్రంధ ప్రజలు కావాలనే ఈ సత్యాన్ని తిరస్కరించిన కారణంగా ఈ “బంధుత్వ ప్రయోజనం” అనేది ముస్లింల-ముస్లిమేతరుల మధ్య లేకుండా పోయింది. కాబట్టి

వారు వారసత్వాన్ని ఒకరికొకరు కలిగి ఉండలేరు. ఒక విధంగా చెప్పాలంటే, ఈ నిర్దేశనం కేవలం ప్రవక్తవారి ప్రత్యక్ష సంబోధితులకు మాత్రమే చెందుతుంది తప్ప ఆ తరువాత వచ్చిన ముస్లిమేతరులకు మాత్రం చెందదు.

***XI. ముస్లిమేతరుల సాక్ష్యం నిషేధం:*** ఒక ముస్లిమేతరుని సాక్ష్యం ఆమోదయోగ్యం కాదని దాదాపు అన్ని ముస్లిం సంఘాలు భావిస్తాయి. కేవలం వీలునామా విషయంలో తప్ప. దానికి కారణం ఏమిటంటే, ఖురాన్ 2:281లో ముస్లింలను ఉద్దేశించి మీరు, మీకు నమ్మకస్తుడైన వాని సాక్ష్యాన్ని తీసుకోవచ్చు. కాబట్టి ఈ విషయంలో విశ్వాస-అవిశ్వాస ప్రాతిపదికలు ఏమీ లేవు. ఇప్పటివరకు మనం చర్చించిన దైవ ప్రతిచర్యా విధానం ప్రకారం సత్యాన్ని కావాలనే తిరస్కరించి, దేవుని ఆగ్రహానికి గురైపోయిన ఆనాటి అవిశ్వాసుల సాక్ష్యం మాత్రమే

తీసుకోకూడదు అనేదే తప్పు, దైవ ప్రతిచర్యా విధానంలో చిక్కుకొనని ఈనాటి ముస్లిమేతరుల సాక్ష్యం మాత్రం మనం స్వీకరించవచ్చు.

***XII.ముస్లిమేతరులను అనుకరించడం నిషేధం:*** ఈ క్రింది హదీసును దృష్టిలో ఉంచుకొని ముస్లిం పండితులు – "ఒక ముస్లిం ఎట్టి పరిస్థితులలోనూ ముస్లిమేతరుల మార్గాలను, వారి పద్ధతులను అనుకరించకూడదు" అని భావిస్తారు. "ముస్లిమేతరుల దుస్తులు ధరించరాదని, అలాగే వారి పండుగలలో పాల్గొనకూడదు" అని కూడా భావిస్తారు. ఈ క్రింది హదీసును వారి ఈ అభిప్రాయాలకు ప్రాతిపదికగా చూపిస్తారు.

ప్రవక్త వారు చెప్పినట్లు ఇబ్నె ఉమర్ చెబుతూ... "ఎవరైతే ఒక జాతిని అనుకరిస్తాడో అతడు ఆ జాతికి చెందిన వాడే అవుతాడు"

–అబూ దావూద్, సునన్, వాల్యూమ్ 4, 44 (నెం:4031)

ఒక హదీసును అర్ధం చేసుకోవటానికి అతి ముఖ్యమైన సూత్రం ఏమిటంటే, ఆ హదీసు యొక్క వివిధ మూలాలను ఒక చోట చేర్చి, దాని తరువాత దాని యొక్క అసలు అర్ధం చూడాలి. ఈ సందర్భంగా ఒకవేళ ఈ హదీసు యొక్క వివిధ మూలాలను ఒకచోట చేర్చి మనం విశ్లేషించినట్లైతే, అప్పుడు మనకు ఒక అర్ధవంతమైన రూపం ముందుకు వస్తుంది.

ప్రవక్త వారు ఈవిధంగా చెప్పారని ఇబ్నె ఉమర్ వారు చెబుతూ...

"నేను దేవుని ఖడ్గంతో పంపబడ్డాను. కేవలం దేవుడు మాత్రమే ఆరాధింపబడాలని. అలాగే నా జీవనోపాధి నా ఖడ్గం ఛాయ్యల్లోనే ఉంది. ఎవరైతే నాకు విధేయతను చూపరో వారికి అవమానం మరియు బానిసత్వం తప్పవు. అలాగే ఎవరైతే, ఒక జాతిని అనుకరిస్తాడో వాడు వారిలోని వాడే అవుతాడు" –అబు అబ్దుల్లా అహ్మద్, ఇబ్నె హంబల్, మస్నూన్, వాల్యూమ్ 2, (నెం:5114)

ఈ హదీసు యొక్క చివరి భాగాన్ని గనుక మనం పరిశీలించినట్లైతే, ముస్లింలు ఒక జాతిని ఎందుకు అనుకరించకూడదో అర్థమౌతుంది. అలాగే మనం మొత్తం హదీసును చూస్తే, గతంలో మనం చర్చించుకున్న దేవుని ప్రతిచర్యా విధానం యొక్క వివరణ అనేది కూడా తెలుస్తుంది. ఈ ప్రతిచర్యా విధానాన్ని బట్టి సత్యతిరస్కారులు ప్రవక్తవారి సహచరుల ఖడ్గాల ద్వారా అవమానాలకు, దు:ఖానికి బలౌతారు. ఈ విషయం ఖురాన్లో వివరంగా చెప్పడం జరిగింది. ఎప్పుడైతే ప్రవక్తవారి సహచరులు ఈ సత్యతిరస్కారుల్ని లొంగదీసుకునే కార్యక్రమాన్ని చేపట్టారో అప్పుడు ఆయా ప్రాంతాలలో ముస్లిములు-ముస్లిమేతరులు కూడా కలసిపోయి ఉండేవారు. వారిరువురి వస్త్రధారణ, వారి గృహాలు ఒకే విధంగా ఉండేవి. ఒకవైపు దాడి చేస్తున్న ముస్లింలను ఉద్దేశించి ఎవరైనా మీకు

సలాం చేస్తే అప్పుడు అతనికి ఏ హానీ చెయ్యవద్దని, అతనిని ముస్లింగా భావించమని ఖురాన్ ఆదేశిస్తుంది. ఇంకా అతని నుండి అతని సంపదను తీసుకోవడానికి “నీవు ముస్లింవి కావు” అని కూడా చెప్పొద్దు అని ఖురాన్ ఆదేశిస్తుంది.

"విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు అల్లాహ్ మార్గంలో 'జిహాద్' కొరకు బయలుదేరినప్పుడు, మిత్రులు-శత్రువుల మధ్య విచక్షణ చేయండి. మీవైపునకు సలాం చేస్తూ ముందుకు వచ్చేవాణ్ణి, 'నీవు ముస్లింవు కావు' అని త్వరపడి అనకండి. మీరు గనక ప్రాపంచిక ప్రయోజనాలను పొందగోరితే, అల్లాహ్ వద్ద మీ కొరకు విజయధనాలు సంవృద్ధిగా ఉన్నాయి. దీనికి పూర్వం స్వయంగా మీరూ ఇదేస్థితిలో ఉన్నారుకదా! ఆ తరువాత అల్లాహ్ మిమ్మల్ని కనికరించాడు. కనుక వివేచనతో వ్యవహరించండి. మీరు చేసేదాన్ని అల్లాహ్ కు బాగా తెలుసు". -4:94

ఈ హదీసు ద్వారా మనకు తెలుస్తున్న విషయం ఏమిటంటే, ఏ ప్రాంతంలోనైతే, ముస్లిం యోధులు దండయాత్రలు చేస్తున్నారో అక్కడ ముస్లింలు-ముస్లిమేతరులు కూడా కలసిపోయి ఉండేవారు. వారిలో ఎవరు ముస్లిం ఎవరు కాదో అనేది గుర్తించడం కష్టతరమైన సందర్భంలో ముస్లింలను గుర్తించడానికి ఏదో ఒక చిహ్నం ఉండాలి అనేది చాలా అవసరం. కాబట్టి ఈ హదీసులో చివరి వాక్యంలో "ఎవరు ఒక జాతిని అనుకరిస్తాడో వాడు వారిలోని వాడే అవుతాడు" అని చెప్పడంలోని ఆంతర్యం. మనం ఒకసారి ఈ హదీసును వివరణాత్మకంగా ఖురాన్ వెలుగులో గమనించినట్లైతే, ఈ విధంగా అభివర్ణించవచ్చు. "ఎవరైతే నన్ను నమ్మరో వారి గతి అవమానం పొందటం మరియు లొంగిపోవటం మాత్రమే. కాబట్టి ముస్లిమేతరుల ప్రాంతాలలో ఉంటున్న ముస్లింలరా! మిమ్మల్ని ముస్లిం యోధులు "వీరు మనవాళ్లే" అని గుర్తించాలంటే, మీరు ముస్లిమేతరులకు మారుగా ఏదైనా చిహ్నం

కలిగి ఉండాలి. ఒకవేళ మీరు అలా కలిగి లేకపోతే అప్పుడు ముస్లిం యోధులు మిమ్మల్ని శత్రు పక్షానికి చెందిన వారిగా భావించి మీకు హాని తలపెట్టే అవకాశం ఉంది" అనే విధంగా ఉంటుంది.

అంతేగానీ ముస్లిమేతరుల వస్త్రధారణ, వారిని అనుకరించడం నిషేధం అని అర్ధం కాదు ఈ హదీసు చెప్పేది. అలాగే ఇస్లాం కూడా ఈ విషయంలో ముస్లింలను ఏ విధంగానూ బంధించి ఉంచడంలేదు. ఇతర జాతుల పద్ధతులను, వారిని అనుకరించడం అనే విషయంలో ధర్మం వారి వారి విచక్షణకు విడిచిపెట్టేసింది.

### *XIII. ఇస్లాం ఆధిపత్యం కోసం పాటుపడటం:*

ఆధునిక కాలపు కొందరు ముస్లిం పండితులు చెప్పేది ఏమిటంటే, ఇస్లాం యొక్క ఆధిపత్యం కోసం అహర్నిశలు కృషిచేయటం ముస్లింల ధార్మిక విధి అని. ఏదైనా ఒక ముస్లిం దేశం ఇస్లాం ను స్థాపించక పోతే, అక్కడున్న ముస్లింలు ఆ దేశ పాలకులను పారద్రోలి ఇస్లాం స్థాపనకు శాయశక్తులా కృషి చేయాలి. ఈ విధమైనటువంటి ఆలోచనను బట్టి మనకు తెలుస్తున్న విషయం ఏమిటంటే, "ఎక్కడైతే ముస్లింలు అల్ప సంఖ్యలో ఉన్నారో ఆయా ముస్లిమేతర దేశాలలో కూడా వారు ఇస్లాం ఆధిపత్యం కోసం కృషి చేయాలి" అనేది. దానికి వారు "ఇస్లామీయ విప్లవం" అనే నామకారణం చేసి, దానికి ఆధారంగా ఈ క్రింది ఖురాన్ వాక్యాన్ని చూపిస్తారు.

"ఆయనే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చి పంపాడు. దానిని సకల ధర్మాలపై ఆధిక్యం వహించే ధర్మంగా

చేయటానికి; ఇది బహుదైవారాధకులకు ఎంత అయిష్టమైనా సరే". -61:9

'సమస్త ధర్మాలు' అనే పద ప్రయోగాన్ని ఆధారంగా చేసుకుని చూస్తే, మనకు ఒక విషయం తెలుస్తుంది. అదేమిటంటే, ఇస్లాం అనుయాయులు వారు ఎక్కడున్నా, ఏ దేశంలో ఉన్న, ఏ భూభాగంలో ఉన్న సరే ఇస్లాం ఆధిపత్యం కోసం కృషి చేయాలి అనేది. కానీ ...

ఈ పై ఖురాన్ వాక్య సందర్భాన్ని మనం విశ్లేషించినట్లైతే ఈ వాక్యం కూడా దేవుని ప్రతిచర్యా విధానానికి సంబంధించినదే అని అర్ధమౌతుంది. అల్ కాఫీరూన్ (ఈ బహుదైవారాధకులు) అనే పదం వాడబడింది. ఖురాన్లో ఈ పదం కేవలం ప్రవక్త కాలంలో ఉన్న అరబ్బు బహుదైవారాధకులకు మాత్రమే వర్తిస్తుంది.

అదేవిధంగా “సమస్త ధర్మాలు” అంటే ఆ కాలంలో అరబ్బు ప్రాంతంలో ఉన్న అన్ని ధర్మాలు అని అర్థం. కాబట్టి ఈ వాక్యం ప్రవక్త ముహమ్మద్ మరియు ఆయన అనుయాయుల తరువాత వచ్చిన ముస్లింలకు మాత్రం వర్తించదు. గతంలో మనం చెప్పుకున్నట్లు ప్రవక్త వారి అనుయాయులకు అరేబియా ప్రాంతంలో అధికారం లభించడం అనేది దేవుని వాగ్దానం కాబట్టి. ఎందుకంటే, అరేబియా బహుదైవారాధకులు కావాలనే సత్యాన్ని తిరస్కరించారు కాబట్టి.

"మీలో విశ్వసించి మంచిపనులు చేసేవారికి అల్లాహ్ చేసిన వాగ్దానమేమిటంటే, ఆయన వారిని, వారికి పూర్వం గతించిన ప్రజలను చేసిన విధంగా, భూమిపై ఖలీఫాలు (ప్రతినిధులు) గా చేస్తాడు, అల్లాహ్ వారికై అంగీకరించిన వారి ధర్మాన్ని వారికొరకు

పటిష్టమైన పునాదులపై స్థాపిస్తాడు. వారియొక్క (ప్రస్తుత) భయ స్థితిని శాంతిభద్రతలతో కూడిన స్థితిగా మరుస్తాడు". -24:55

కాబట్టి, ఇస్లామీయ రాజకీయ్య ఆధిపత్యం కోసం కృషి చేయడం ముస్లింల బాధ్యత కాదు అనే విషయం తెలుస్తుంది. ఇది కేవలం దేవుని ప్రతిచర్యా విధానంలోని భాగంగా ప్రవక్త ముహమ్మద్ మరియు ఆయన గారి ఆనాటి అనుయాయులకు మాత్రమే సంబంధించినది అని మనం గ్రహించాలి.

# 6.ముగింపు:ముస్లిమేతరులతో సంబంధాలు:

ఇప్పటివరకూ మనం చర్చించుకున్న విషయాలను బట్టి మనకు అర్ధమైన విషయం ఏమిటంటే, సర్వసృష్టికర్త అయిన దేవుడు ఆ రాబోయే పరలోక జీవితంలో శిక్షా-బహుమానలు ఖచ్చితంగా

ఉన్నాయి అని మానవులకు ఈ ప్రపంచంలోనే దాని కొన్ని సూచనలను తెలపటానికి కొంత మందిని తన సందేశహరులుగా ఎన్నుకుంటాడు. ఆయా దైవ సందేశహరులు తమతమ జాతులకు సంభవించబోయే ఆ సత్యాన్ని నిష్కర్షగా ఉన్నది ఉన్నట్లు చేరవేస్తారు. ఆ సత్యం ఏమిటో మనం గత పేజీలలో కూడా చర్చించుకున్నాం. అయినప్పటికీ మరోసారి నెమరేసు కుంటే... ఒకవ్యక్తి తాను ఈ లోకంలో చేసుకున్న మంచి-చెడు పనులకు ఆ రాబోయే పరలోక జీవితంలో తన సృష్టికర్త ముందు హాజరు అయి శిక్షా-బహుమానాలను పొందవలసి ఉంటుంది.

దేవుని యొక్క ప్రత్యేకమైన సహాయంతో (శృతి / వహీ ద్వారా) ఈ సందేశహరులు సత్యానికి చుట్టుముట్టిన అనేకమైన అపార్థాలను, మూఢనమ్మకాలను తొలగిస్తారు. అలాగే "ఈ సత్యాన్ని గనుక మీరు స్వీకరించకపోతే ఇహ-పరాలలో తీవ్రంగా శిక్షింపబడతారు"

అని తీవ్రంగా ప్రజలను హెచ్చరిస్తారు. సత్యాన్ని స్వీకరించినవారికి ఇహ-పరాలలో సాఫల్యం ఉందనే శుభవార్తను కూడా ఇస్తారు. ఈ సత్యాన్ని కావాలనే బుద్ధిపూర్వకంగా తిరస్కరించిన వారు అనేక విధాలుగా శిక్షింపబడతారు. ఈ మొత్తం వ్యవహారాన్ని మనం దృష్టిలో ఉంచుకొని చూస్తే, మొత్తానికి శిక్షా-బహుమానాలు వారివారి కర్మలను బట్టి పరలోకంలో ఉంటాయని అర్థమౌతుంది.

ఈ మొత్తం పైన చర్చించిన విషయాలను దృష్టిలో ఉంచుకొని మనం అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే, దేవుని ప్రతిచర్యా విధానం విషయంలో ఇస్లాం తనదంటూ కొన్ని నిర్దిష్టమైన నిర్దేశనాలను కలిగిఉంది. దేవుని ఈ ప్రతిచర్యా విధానం అనేది కేవలం ప్రవక్త ముహమ్మద్ మరియు అతని ప్రత్యక్ష అనుచరులకే పరిమితమైనది తప్ప ఆ తరువాతి తరాల వారికి ఏ మాత్రం సంబంధించినది కాదు. ఇప్పటి వరకు మనం ఈ విషయాలను చాలాసార్లు చర్చించుకున్నాం. ఈ నిర్దేశనాలు

కేవలం బుద్ధిపూర్వకంగా సత్యాన్ని తిరస్కరించిన వారికొరకే. (అంటే వారికి దైవ సందేశహరులచే అనేకమైన అధ్భుతాలు, మహత్యాలు చూపించినప్పటికీ, కావాలనే ఈ అద్భుతాలనూ, మహత్యాలనూ తిరస్కరించినవారు). వహీ / శృతి వ్యవస్థ అంతమైపోయిన తరువాత ఒక ముస్లిమేతరుడు సత్యాన్ని తిరస్కరిస్తున్నాడో లేదో ఎవరూ చెప్పలేరు. కేవలం ఆ విషయం దేవునికే తెలుసు. ఆయా ప్రవక్తల కాలంలో స్వయంగా దేవుడు ఈ తీర్పు ఎవరి విషయంలో చేయాలో తన ప్రవక్తల ద్వారా చేయించేవాడు. ఇక ప్రవక్తల పరంపర లేదు కాబట్టి, ఎవరి విషయంలో కూడా వహి / శృతి అవతరించదు.

కాబట్టి ముస్లింలు ఖురాన్ను, ప్రవక్త ముహమ్మద్ వారి జీవిత చరిత్రను కూలంకషంగా అధ్యయనం చేసినట్లైతే, వారికి చాలా వివరణాత్మకమైన సమాచారం ఈ దైవ ప్రతిచర్యా విధానం గురించి సరైన విధంగా దొరుకుతుంది.

ఒకవేళ ఇప్పటివరకూ చర్చించబడిన విషయాలన్నీ నిజమైనవే అని ఒక ముస్లిం భావిస్తే, ముస్లిమేతరుని పట్ల అతనికి ఉన్న భావాలు అన్నీ అమాంతంగా మారిపోతాయి. వారిని లొంగదీసుకోవడం సమంజసమే అనే భావన దూరమై, వారికి ప్రేమపూర్వకంగా, అర్థమైన రీతిలో ఇస్లాం సందేశాన్ని ఇవ్వటానికి ప్రయత్నిస్తాడు. ఈ విషయంలో అనేకమైన మంచి దారులు వెతుకుతాడు. వారి విషయంలో సకరాత్మక భావాలు కలిగి వారిని తన గౌరవప్రదమైన సంబోధితులుగా భావిస్తాడు. వారితో మంచిగా ప్రవర్తిస్తూ తన విశాలతను ప్రదర్శిస్తాడు. విరుద్ధ, విద్వేష భావాల వలన సౌశీల్యత అనేది మొత్తం నశించిపోతుంది.

అంతే కాకుండా ప్రతీ ముస్లిం సంస్కర్తల సంఘాల నాయకులు ఎల్లప్పుడూ జ్ఞాపకం ఉంచుకోవలసిన విషయం ఏమిటంటే,

“ఇస్లాం ధర్మ ఆధిపత్యం కోసం ముస్లింలు కృషిచేయాలి అనేది వారికి షరియత్ విధించిన విధి కాదు” అనేది. ఎక్కడైతే వారు అధిక సంఖ్యలో (మెజారిటీలో) ఉంటారో, అక్కడ వారు ఇస్లాంను అమలుపరచాలి. ఎక్కడైతే వారు అల్ప సంఖ్యలో (మైనారిటీలో) ఉంటారో అక్కడి ప్రజలకు సందేశాన్ని అందించి వారిని చైతన్య పరచి, మెజారిటీని సంపాదించడానికి కృషి చేయాలి. ప్రవక్త ముహమ్మద్ (స.అ.సం) వారు గాని, ఆయన అనుచరులు గాని ఇస్లామీయ రాజ్యాన్ని స్థాపించడానికి కృషిచేయలేదు. దేవుని ప్రతిచర్యా విధానంలో భాగంగా వారు ఒక రాజ్యాన్ని పరిపాలించే భాగ్యానికి బహూకరింపబడ్డారు. కాబట్టి ఇస్లామీయ రాజ్యస్థాపన కొరకు కృషిచేయడం షరియత్ విధించిన నిర్దేశనం మాత్రం కాదు.

ఇక్కడ మనం ఒక విషయం చెప్పుకోవడం కూడా ముఖ్యమే. అది... ఒకవేళ ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్నప్పుడు లేదా అల్పసంఖ్యలో ఉన్నప్పుడు షరియత్ చట్టాన్ని అమలు

చేసుకోవాలి అనుకుంటున్నప్పుడు వారు ప్రజాస్వామ్య పద్ధతిని అనుసరించాలి అని ఇస్లాం బోధిస్తుంది. అటువంటి సందర్భంలో వారు ప్రజలను ఒప్పించి చైతన్య పరచి అధిక సంఖ్యాకుల విశ్వాసాన్ని పొందగలగాలి. ఒక అల్పసంఖ్యాక వర్గం ఎన్నటికీ తన అభిమతాన్ని అధిక సంఖ్యాక వర్గం వారిపై రుద్దజాలదు. ఈ సందర్భంగా ఖురాన్ "...తమ వ్యవహారాలను పరస్పర సంప్రదింపుల ద్వారా నడుపుకునే వారి కోసం..." -42:38

ఈ పై ఖురాన్ వాక్య ప్రయోగాన్ని బట్టి మనకు అర్ధమైన విషయం ఏమిటంటే, ముస్లింలలోని అధిక సంఖ్యాకుల అభిప్రాయాలను ఎట్టి పరిస్థితులలోనూ రద్దుచేయకూడదు. “విశ్వాసులు తమ వ్యవహారాలలో సంప్రదించుకోవాలి” అని కాకుండా, “విశ్వాసుల రాజ్య/పరిపాలన వ్యవహారాలు పరస్పర సంప్రదింపుల ద్వారా నడుపుకోవాలి” అని ఖురాన్ చాలా స్పష్టంగా చెబుతుంది. ఈ

ఖురాన్ వాక్యంలో పదప్రయోగాన్ని బట్టి ఒక ఇస్లామీయ ప్రభుత్వం ఏర్పడాలంటే, విశ్వాసుల పరస్పర సంప్రదింపుల ద్వారా జరగాలి. అలాగే ఆ ప్రభుత్వం ఉనికిలో ఉండాలన్నా, లేక అధికారం కోల్పోవాలన్నా ఈ సంప్రదింపుల ఆధారంగానే జరగాలి. అన్ని విషయాలు కూడా అధిక సంఖ్యాక పౌరుల అభిప్రాయాల ప్రకారంగానే జరగాలి.

ముస్లింలు ఎక్కడైతే నివసిస్తున్నారో –ముస్లిం దేశమైన ముస్లిమేతర దేశమైన- అక్కడ మంచి మార్పు తీసుకురావాలంటే, అప్పుడు వారు ప్రజాస్వామ్య పద్ధతిని అవలంభించాలి. ఒక ముస్లిమేతర దేశంలో ఉంటున్నప్పుడు ముస్లింలు తాము ఆ దేశ పౌరులం అని జ్ఞాపకం ఉంచుకొని ఆ దేశ చట్టానికి కట్టుబడి ఉండాలి. ఇది వారి ధార్మిక విధి. ఎందుకంటే, వారు ఆ దేశంతో ఒప్పందం చేసుకొని ఉన్నారు కాబట్టి. తమ ఒప్పందాలను

వాగ్దానాలను తెంచడం దేవుని దృష్టిలో చాలా నీచమైన విషయం. అంతేకాదు ఒకవేళ వారు తమ ధర్మాన్ని పాటించడానికి ఆ దేశ చట్టాలుగానీ, పరిపాలకులుగానీ ఆటంకం కలిగించినా సరే, వారు ఆ దేశ చట్టాలను ఉల్లంఘించకూడదు, ఏవిధమైనటువంటి అలజడులకు పాల్పడకూడదు . ఆ దేశ చట్టాలు, పరిపాలకుల ఈ విధమైనటువంటి హింసా ప్రవృత్తులు ఖచ్చితంగా ఖండించదగ్గవే. మత స్వేచకోసం శాంతియుతమైన ప్రయత్నాలు చేసినప్పటికీ, సఫలం కాకపోతే అప్పుడు ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టి మరొక ప్రాంతానికి వలస వెళ్లిపోవాలే తప్ప ఆ దేశంలో మాత్రం అరాచకం సృష్టించకూడదు.

ఈరోజు ముస్లిమేతర ప్రపంచం ముస్లింల సమూహాన్ని చూసి భయభ్రాంతులకు గురైఉంది. ముస్లింలు వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అడ్డంకిగా కనబడుతున్నారు. వీరి ఈ భయాందోళనలను దూరం చేయవలసిన బాధ్యత ముస్లింలపై ఉంది.

చాలా అధికంగా ప్రాచుర్యంలో ఉన్న జాతుల మధ్య వివాదాలు అనేవి జాతులమధ్య ఒప్పందాలుగా మారిపోవాలి.

అలాగే ఈ వ్యాసంలో చర్చించుకున్న విషయాలు ఆమోదయోగ్యమైనవిగా భావిస్తే, అప్పుడు ముస్లిమేతరుల ఈ భయాలు యావత్ ప్రపంచంలో పటాపంచలైపోతాయి. అప్పుడు వారు ఉద్దేశపూర్వకంగానే దేవుని చివరి ప్రవక్తను తిరస్కరిస్తే, అప్పుడు తమకు సంభవించే పరిణామాలపై ప్రశాంతంగా ఆలోచిస్తారు. అలాగే వారి పూర్వీకులు దైవ ప్రవక్తలను కావాలనే తిరస్కరించిన కారణంగా అనుభవించిన చేదు అనుభవాలను వీరు నెమరువేసుకునే అవకాశం ఉంది. అలాగే కనీసం ఈ లోకంలోనైనా వీరిపై మృత్యుఖడ్గాలు వ్రేలడకుండా ఉంటాయి. తాము ఈ సత్యాన్ని కావాలనే తిరస్కరిస్తున్నాము అనే విషయం వారికి ఈ లోకంలో తెలిసినా తెలియకపోయినా ఖచ్చితంగా

పరలోకంలో మాత్రం ఈ సత్యం వారికి తెలిసిపోతుంది. ఈ విధమైనటువంటి ప్రవర్తన వారికి అనేక బాధలకు గురి చేస్తుంది. కనుక వారు కూడా తాము చూపిస్తున్న నిర్లక్ష్య ప్రవర్తన వల్ల పరలోకంలో ఎదురయ్యే పరిణామాల గురించి ఆలోచించాలి. సర్వసృష్టికర్త అయిన దేవుడు తన సందేశహరులను, గ్రంధాలను పంపించి మానవులను హెచ్చరించాడు. రేపు పరలోకంలో వారు ఏవిధమైనటువంటి సాకులు చెప్పటానికి వీలులేకుండ.

"ఈ ప్రవక్తలందరూ శుభవార్తను తెలిపేవారుగా, హెచ్చరిక చేసేవారుగా పంపబడ్డారు. వారి ఆవిర్భావం తరువాత - అల్లాహ్ కు వ్యతిరేకంగా వాదించటానికి ప్రజలవద్ద ఏ సాకూ మిగలకూడదని. ఎట్టి పరిస్థితులలోనైనా అల్లాహ్యే ఆధిక్యం కలిగిఉండేవాడు, మహా వివేకవంతుడు. (ప్రజలు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా)" -4:165

కాబట్టి ప్రవక్త ముహమ్మద్ మరియు ఆయన సందేశ కార్యక్రమం ముస్లిమేతరుల ఆలోచనను తట్టిలేపేదిగా నిరంతరం కొనసాగుతూ ఉండాలి. ప్రవక్త ముహమ్మద్ వారు దేవుని సందేశహరుడు, ఆయన సందేశాన్ని తిరస్కరిస్తే ఆ పరలోకంలో సంభవించే పరిణామాల గురించి ముస్లిమేతరులకు తెలియపరుస్తూనే ఉండాలి ఖురాన్లో తెలియపరచినట్లు. దేవుడు ఈ సత్యాన్ని ప్రజలకు స్పష్టపరుస్తూ, తన పాత్రను ఏ విధంగా పోషించాడో అనే విషయాలు ప్రజలకు తెలియపరుస్తూ ఉండాలి. కేవలం దేవునితో వారి న్యాయబద్ధమైన క్షమాపణ మాత్రమే వారిని తీర్పుదినం నాటి ఆయన ఉగ్రతనుండి కాపాడగలదు. (అనే విషయం మనం వారికి చెప్పాలి)

**సమాప్తం!**

**జై హింద్ !!**